ఏదైనా కర్మాగారంలో ప్రమాదాలు సంభవించకుండా చూసుకోవాలి. అనివార్యంగా ప్రమాదం పొంచి ఉంటే వాటిని నివారించేందుకు అవసరమైన సేఫ్టీ మెజర్‌మెంట్స్ కూడా ఉండాలి. బాయిలర్స్, రియాక్టర్స్‌లో పొగలు, ఆవిరి, మంటలు రావడాన్ని గమనించిన వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలి. నైపుణ్యం కలిగిన వాళ్లతో ప్రమాదాల నివారణకు పూనుకునేందుకు వీలుగా అవసరమైన సేఫ్టీ మెజర్‌మెంట్స్ ఉండాలి. ఫార్మా బల్క్‌డ్రగ్, కెమికల్ ఫ్యాక్టరీల్లో ఇవేవీ లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. పాత కాలం నాటి బాయిలర్స్‌ను ఉపయోగించడం వల్లనే ఎస్‌బీ ఆర్గానిక్‌లో మంటలొచ్చి రియాక్టర్‌పై పడి పేలుళ్లు సంభవించాయి. రియాక్టర్‌లో పొగ వస్తుండటంతో చూసి డైరెక్టర్ రవిశర్మ అక్కడికి వెళ్లారు. అంతలోనే రియాక్టర్ పేలి తునకాతునకల య్యారు. రియాక్టర్‌లో మంటలు రాగానే నీళ్లు చల్లడం వల్ల అది మరింత శక్తివంతంగా పేలినట్టు కార్మికులు చెబుతున్నారు. దీన్ని బట్టి కనీస నైపుణ్యంలేని వాళ్లు రియాక్టర్ ప్రాంతంలో పనిచేస్తున్నారన్న విషయం అర్థమవుతోంది. రియాక్టర్ల కాలం తీరగానే వాటిని తీసేసి కొత్తవి పెట్టాల్సిన యాజమాన్యాలు.. ఖర్చుల పేరిట పాత వాటితోనే నెట్టుకొస్తున్నారు. దాంతో 20 రోజుల వ్యవధిలోనే జిల్లాలో మూడు ప్రమాదాలు జరిగి 11 మంది చనిపోగా 50 మంది క్షతగాత్రులయ్యారు. కోవలెంట్‌లో రియాక్టర్ పేలి 4మంది కార్మికులు చనిపోయారు. పాశమైలారంలోని సీఎంహెచ్‌లో ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందగా 18 మంది గాయపడ్డారు. ఎస్‌బీ ఆర్గానిక్‌లో రియాక్టర్ పేలి 6మంది మరణించగా 30 మంది క్షతగాత్రులయ్యారు.

నైపుణ్యంలేని వలస కార్మికులతో పని

ఫార్మా, కెమికల్, బల్క్‌డ్రగ్స్ వంటి ఫ్యాక్టరీస్‌లో నైపుణ్యం కల్గిన వాళ్లే పనిచేయాలి. ఎంఎస్సీ, బీఎస్సీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ వంటి చదువులు చదివిన అనుభవమున్న వాళ్లు కాకుండా.. రసాయనాలు, ఫ్యాక్టరీ నిర్వహణ పట్ల కనీస అవగాహన లేని వలస కార్మికులతో పనిచేయిస్తున్నారు. నైపుణ్యం, అనుభవరాహిత్యంతో కూడిన వాళ్లను కాంట్రాక్టు ఏజెన్సీల ద్వారా తీసుకుంటున్నారు. యూపీ, ఎంపీ, తమిళనాడు, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలుండవు. ప్రమాదాలు జరిగి ప్రాణం పోయినా, క్షతగాత్రులైనా ఎవరూ పట్టించుకునే వారుండకపోవడంతో కంపెనీలు వాళ్లను బలిపశువుల్ని చేస్తున్నాయి.

ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం


ఫ్యాక్టరీస్ చట్టాలు అనేకమున్నాయి. కర్మాగారాల్ని తనిఖీ చేసే ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ మండలి ఇంజనీర్లు, లేబర్ కమిషనర్లు, పరిశ్రమల శాఖ అధికారులు, అగ్నిమాపక శాఖ, క్వాలిటీ కంట్రోల్ టీమ్స్‌తో పాటు వీటిని సమన్వయం చేయాల్సిన జిల్లా కలెక్టర్ సమన్వయంతో పనిచేయకపోవడంతో ఫ్యాక్టరీస్ యాజమానులది ఇష్టారాజ్యంగా మారింది. సమన్వయంతో ఫ్యాక్టరీలను నిరంతరం తనఖీ చేసి అన్నీ సక్రమంగా ఉండేలా చూస్తే ప్రమాదాలుండవు. ఫ్యాక్టరీస్ యజమానులకు రాజకీయ నాయకుల అండదండ లుండటంతో అధికార యంత్రాంగం కూడా అనుకూలంగా వ్యవహరిస్తుంది.

ఏనుగు దాడిలో మరో రైతు మృతి

- లభించని గజరాజు ఆచూకీ.. ఆందోళనలో పరిసర గ్రామాలు
- నాలుగు మండలాల్లో 144 సెక్షన్
- గాలింపు చర్యలు చేపట్టిన అటవీశాఖ అధికారులు
- ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యం
- గస్తీ ముమ్మరం : కాళేశ్వరం జోన్ సీఎఫ్ శాంతారామ్

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

ఏనుగు దాడిలో మరో రైతు మృతిచెందిన ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం కొండపెల్లి గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. చింతల మానెపెల్లి మండలంలో బుధవారం ఏనుగు దాడిలో రైతు మరణించి 24 గంటలు గడవకముందే మండలంలోని కొండపెల్లి గ్రామానికి చెందిన మరో రైతు ఏనుగు దాడిలో మృతి చెందడం కలకలం రేపుతోంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కారు పోచయ్య(65) గ్రామ సమీపంలో తన పొలం వద్దకు మోటారు వేయడానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పొలాలకు దగ్గర రోడ్డుపక్కన ఉన్న ఏనుగు ఒక్కసారిగా ఆయనపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖకు సమాచారం అందించగా.. వారు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏనుగు జాడ కోసం అటవీ శాఖ అధికారులు గాలిస్తున్నారు. ఏనుగు కాలి ముద్రల ఆధారంగా ఏ వైపునకు వెళ్లిందో తెలుసు కోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, అదనపు కలెక్టర్ వేణు, రేంజ్ అధికారి సుధాకర్ చేరుకొని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారితో మాట్లాడారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఐదెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాల్సిందిగా గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేశారు. అధికారులు రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని గ్రామస్తులు పట్టుబట్టారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా కొంత నగదును అధికారులు అందజేశారు. మృతునికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో అటవీ పరిసర గ్రామాల్లోని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పెంచికల్ పేట్, బెజ్జూరు ప్రధాన రహదారి గుండా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కొండపెల్లి మాజీ సర్పంచ్ సుధాకర్ ఏనుగును



చూడడం..అది ఆయన వెంట పడటంతో గ్రామంలోకి పరుగులు తీశారు. ఏనుగును పరిసరాల నుండి వెళ్లేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు పరామర్శించారు. సంఘటనా స్థలానికి కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ కొమురయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు వెళ్లి పరిశీలించారు.

ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యం : కాళేశ్వరం జోన్ సీఎఫ్ శాంతారామ్

బెజ్జూర్ :కుమురం భీం జిల్లాలో ఇద్దరు రైతులపై ఏనుగు దాడి చేసి చంపడం దురదృష్టకరమని కాళేశ్వరం జోన్ సీఎఫ్ శాంతారామ్ అన్నారు. గురువారం బెజ్జూరు మండల కేంద్రంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పెంచికల్‌పేట, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏనుగు దాడిలో మరణించిన ఒక్కో రైతుకు ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తోందన్నారు. అటవీ ప్రాంత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఏనుగు కోసం ప్రత్యేకంగా 40 మానిటరింగ్ టీమ్‌లు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. మగ ఏనుగు ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్ర మీదుగా తెలంగాణకు వచ్చినట్టు వెల్లడించారు. ఈ ఏనుగు ప్రతిరోజు సాయంత్రం వేళల్లో 20 నుంచి 30 కిలో మీట.ర్లు ప్రయాణిస్తుందన్నారు. ప్రజల ప్రాణాలే తమకు ముఖ్యమని ఇండ్ల నుండి బయటకు వెళ్లొద్దని సూచించారు. ఏనుగు కోసం డ్రోన్ కెమెరాలు, థర్మల్ డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో ఏనుగులకు ఆహారం దొరకక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో నీటి సౌకర్యం ఉండడం వల్ల ఈ ప్రాంతానికి ఏనుగు వచ్చినట్టు తెలిపారు. ఛత్తీస్‌గడ్‌లో 100 ఏనుగులు, మహారాష్ట్రలోని గడ్చిరోలిలో 25 ఏనుగులు ఉన్నాయని వివరించారు. తెలంగాణలో మొదటిసారి ఏనుగులు వచ్చి హల్‌చల్ చేస్తున్నట్టు తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో డప్పు చాటింపు చేపట్టినట్టు తెలిపారు. సమావేశంలో ఆసిఫాబాద్ డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రీవాల్, బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్, డిప్యూటీ రేంజర్ శ్రావణ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.



రాజ్యసభ సభ్యునిగా..
వద్దిరాజు ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-ఖమ్మం

రాజ్యసభ సభ్యులుగా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర ప్రమాణస్వీకారం చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం ఉదయం ఆయన చేత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా చైర్మెన్‌తో పాటు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్, రాజ్యసభ సభ్యులు పలువురు రవిచంద్రకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

కొండంత నష్టం... గోరంత పరిహారం

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడుతోంది. 2015-16 నుంచి 2019-20 వరకు రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ప్రకృతి వైపరీత్యాల కమిషన్ నివేదిక ప్రకారం ఐదేండ్లలో రూ.14.812 కోట్ల పంట నష్టం జరగ్గా, కేంద్రం రూ.2,306 కోట్లు మాత్రమే పరిహారంగా ఇచ్చింది. 2018 నుంచి 2023-24 వరకు

వరదలు, వడగండ్ల వానల వల్ల రూ. 12,700 కోట్ల పంట నష్టం జరగ్గా, రూ. 1,787 కోట్ల నామ మాత్రం సాయం అందించింది. డిసెంబర్ 2023 వరకు వరదల వల్ల 1,21,353 మంది రైతులకు చెందిన 60.99 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మొత్తంగా చూస్తే గడిచిన పదేండ్ల కాలంలో మొదటి ఐదేండ్లు కరువు తాండవించగా, తర్వాత ఐదేండ్లు వరదలు, వడగండ్ల వానలు ప్రతాపాన్ని చూపించాయి. అతివృష్టి, అనావృష్టితో రాష్ట్రం 2015-16 నుంచి 2023-24 వరకు రూ. 27,512 కోట్ల పంటలు నష్టపోగా, బీజేపీ ప్రభుత్వం మాత్రం రూ.4,093 కోట్ల గోరంత పరిహారాన్ని అందించింది. తెలంగాణ ఏర్పడి పదేండ్లు గడుస్తున్నప్పటికీ విభజన హామీలు పూర్తిగా అమలు కాలేదు. రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటాలు, ప్రాజెక్టులకు జాతీయ హోదా, వివిధ పథకాల కేటాయింపులతో పాటు కరువు సాయం అందించండలోనూ అడుగడుగునా వివక్షను ప్రదర్శించింది. కమలం పార్టీ రాష్ట్రం పట్ల అనుసరిస్తున్న పక్షపాత వైఖరి, వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టడంలో రెండు పార్టీలూ విఫలమయ్యాయి. పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న ప్రస్తుత కీలక తరుణంలో బీజేపీని అడ్డుకోవడాన్ని పక్కన పెట్టి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడానికే పరిమితమవుతున్నారు. బీజేపీ బలపడితే రాష్ట్రానికి ప్రమాదకరమని ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెరువులు, కుంటలను సాగర్ నీటితో నింపాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని ఎడమకాల్వకు విడుదల చేస్తున్నారని, ఆ నీటితో నల్లగొండ జిల్లాలోని చెరువులు, కుంటలు, కాలువలు నింపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణకేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు, బావులు పూర్తిగా అడుగంటిపోయాయని, దాంతో తాగు, సాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకొని తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చెరువులు, కుంటలు నింపాలని కోరారు. ముఖ్యంగా తాగునీటి రిజర్వాయర్లను నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. సాగు నీరు లేక ఎండిపోయిన పంట పొలాలను ప్రభుత్వం, అధికారులు పరిశీలించి ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రవి నాయక్, డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, భవాండ్ల పాండు, వినోద్ నాయక్, తిరుపతి రామ్మూర్తి, పరుశురాములు, గోవింద్ రెడ్డి, ఉన్నం వెంకటేశ్వర్లు, పిల్లుట్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు, పాలనను గాలికొదిలేసిన ప్రభుత్వం

- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి
- కోతులు చనిపోయిన ట్యాంక్‌ను పరిశీలన



నవతెలంగాణ-నాగార్జునసాగర్

ప్రభుత్వం ప్రజలను, పాలనను గాలికి వదిలేసిందని బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ (నందికొండ)లో వానరాలు చనిపోయిన మంచినీటి వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్ కుమార్, రమావత్ రవీంద్ర కుమార్‌తో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కోతులు చనిపోయిన వాటర్‌ట్యాంక్ నీరు తాగిన వారందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. నాగార్జునసాగర్‌ను మున్సిపాలిటీగా తీర్చిదిద్ది అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ దేనని అన్నారు. 2014కు ముందు ఉన్న రోజులు పునరావృతం అవుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో పెద్దవూర ఎంపీపీ ప్రత్యేక సలహాదారులు సుందర్ రెడ్డి, మండల అధ్యక్షులు రవి నాయక్, నందికొండ కౌన్సిలర్ జి. రమేష్, ఊర శ్రీనివాస్, సిరికొండ మధు, వీరయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.25 లక్షల నకిలీ కరెన్సీ పట్టివేత

- నలుగురు నిందితులు అరెస్టు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.25 లక్షల నకిలీ కరెన్సీ తరలిస్తుండగా మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 25 లక్షల నకిలీ కరెన్సీతో పాటు నిస్సాన్ కంపెనీకి చెందిన కారు, నాలుగు మొబైల్ ఫోన్స్, కీప్యాడ్ మొబైల్, రూ.8,240 వేల అసలైన నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన హరుణ్, సయ్యద్ సగీర్, జాకీర్ సయ్యద్, అలీ అఫ్తాబ్ అక్తర్ నుంచి రూ. 25 లక్షల నకిలీ కరెన్సీతో నిస్సాన్ కారులో మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు బయలు దేరారు. మార్గమధ్యలో ఎర్రకుంట వద్ద మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు తనిఖీలు చేస్తుండగా నిందితుల నిస్సాన్ కారు అనుమానాస్పదంగా కనిపించింది. దాంతో కారును పోలీసులు ఆపి తనిఖీ చేయగా రూ.25 లక్షల నకిలీ కరెన్సీ బయట పడింది. నిందితులు ఒకింత ఒరిజినల్ కరెన్సీ మధ్యలో మూడింతల నకిలీ కరెన్సీ పెట్టి చలామణి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు బాలాపూర్ పోలీసులకు అప్పగించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. బాలాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్య పన్నుల శాఖ అధికారుల పై ఏసీబీ దాడులు



నవతెలంగాణ-కల్లూరు

ఖమ్మం జిల్లా కల్లూరు పట్టణ పరిధిలోని ఎన్ఎస్‌పీ క్రాస్ రోడ్ వద్ద వాహనదారుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడు తున్న వాణిజ్య పన్నులశాఖ అధికారులను ఏసీబీ అధికారులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న ఏసీటీవో శ్రీరామ్, వారి సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద అదనంగా ఉన్న పది వేల రూపాయల నగదు, పత్రాలను సీజ్ చేశారు. వాహనదారుల నుంచి అనధికారికంగా కమర్షియల్ ట్యాక్స్ అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించినట్టు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.582 కోట్ల ఈబీలు చెల్లించి.. నష్టాల్లో 33 కంపెనీలు..

(మొదటిపేజీ తరువాయి)

ప్రవాహంపై హిందూ, ఒక స్వతంత్ర పరిశోధనా బృందం సంయుక్తంగా చేపట్టిన పరిశోధనలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఈ 45 కంపెనీలు నాలుగు కేటగిరీలుగా (ఏ,బీ,సీ,డీ) విభజించాయి.33 కంపెనీలు ఇచ్చిన ఈబీలలో మొత్తం రూ.576.2 కోట్ల విరాళంలో రూ.434.2 కోట్లు (దాదాపు 75 శాతం) బీజేపీకి అందాయి. 2016-17 నుండి 2022-23 వరకు ఏడు సంవత్సరాలలో ఈ కంపెనీలు నష్టాలు లేదా దాదాపు జీరో లాభాన్ని కలిగి ఉన్నాయి. ఈ 33 కంపెనీల మొత్తం నికర నష్టాలు రూ.1 లక్ష కోట్లకు పైగా ఉన్నాయి. ఈ 33 కంపెనీలలో 16 కంపెనీలు (కేటగిరీ ఏ) మొత్తంగా సున్నా లేదా ప్రతికూల ప్రత్యక్ష పన్నులను చెల్లించాయి. ఈ నష్టాలను మూటగట్టుకున్న కంపెనీలు గణనీయమైన విరాళాలు ఇచ్చాయని పరిశోధనలో వెల్లడైంది. అటే అవి ఇతర సంస్థలకు షెల్ కంపెనీలు అయి ఉండవచ్చు లేదా ఆ కంపెనీల లాభ, నష్టాలను తప్పుగా నివేదించడంతో మనీ లాండరింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని స్పష్టం చేశాయి. ఆరు కంపెనీలు మొత్తం రూ.646 కోట్లను విరాళంగా ఇవ్వగా అందులో రూ.601 కోట్లు (93 శాతం) బీజేపీకి అందాయి. ఈ కంపెనీలు 2016-17 నుంచి 2022-23 వరకు మొత్తంగా సానుకూల నికర లాభాలను కలిగి ఉన్నాయి. అయితే ఈబీల ద్వారా విరాళంగా ఇచ్చిన నగదు ఆ కంపెనీల మొత్తం నికర లాభాన్ని గణనీయంగా మించిపోయినట్లు అధ్యయనంలో వెల్లడైంది. ఈ కంపెనీలు (కేటగిరీ బీ) వారి లాభనష్టాలను తప్పుగా నివేదించి ఉండవచ్చునని తెలిపారు. మూడు కంపెనీలు మొత్తం రూ.193.8 కోట్లు విరాళంగా ఇవ్వగా, రూ.28.3 కోట్లు (సుమారు 15 శాతం) బీజేపీకి అందాయి. మిగిలిన వాటిలో కాంగ్రెస్ రూ.91.6 కోట్లు (47 శాతం), తణమూల్ - రూ.45.9 కోట్లు (24 శాతం), బీఆర్.ఎస్, బీజేడీ - రూ.10 కోట్లు, (5 శాతం చొప్పున), ఆప్ - రూ.7 కోట్లు (3.6 శాతం) అందుకున్నాయి. ఈ మూడు కంపెనీలు సానుకూల నికర లాభాలను కలిగి ఉన్నాయి కానీ 2016-17 నుంచి 2022-23 వరకు మొత్తంగా ప్రతికూల ప్రత్యక్ష పన్నులను నివేదించాయి. అటువంటి కంపెనీలు (కేటగిరీ సి) పన్ను ఎగవేతలు చేసి ఉండవచ్చు.

రాజ్యాంగం, రాష్ట్రాల హక్కులను రక్షిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అసహనం, విద్వేషం, హింసల ప్రాతిపదిక కలిగిన నిరంకుశవాద, ఫాసిస్ట్, హిందూత్వ దేశంగా మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. దేశంలోని ప్రతి వ్యవస్థలోనూ అనూహ్యమైన రీతిలో చొచ్చుకుపోయి భారతదేశ ప్రజల నరాల్లోకి తన మతోన్మాద విషాన్ని వ్యాపింపజేస్తున్న బీజేపీ మూల సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ బహిరంగంగా ప్రకటిస్తున్న లక్ష్యం ఇదే. ఆ ప్రయత్నాలకు వ్యతిరేకంగా భారతదేశాన్ని కాపాడేలా ఈ లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి.

గత లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఈ ఐదేండ్లలో, భారత్ కూడా అనేక పోరాటాలను చూసింది, కార్మికులు, రైతులు, ఆదివాసీలు, దళితులు, మహిళలు, యువత, విద్యార్థుల ప్రజాస్వామ్య పోరాటాల ద్వారా తీవ్ర ప్రతిఘటనను చవి చూసింది. ప్రజలు ఐక్యంగా వుండి పోరాడితే ఈ ప్రభుత్వం సాగించే అణచివేతను, అధికారాన్ని శక్తి సామర్థ్యాలను ఈ పోరాటాలు సవాలు చేయగలవని, ఓడించగలవని రుజువైంది. ముఖ్యంగా రైతుల చారిత్రక పోరాటం దీన్ని రుజువు చేసింది కూడా. ఇదే కాలంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలో వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అమలు చేసిన ప్రత్యామ్నాయ విధానాలను కూడా మనం చూశాం. ఆర్థికపరంగా చిక్కుల్లో పడేయడానికి కేంద్రం అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కేరళ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రజానుకూల విధానాలకు, మత సామరస్యతకు ఒక ఆశా కిరణంగా ఆవిర్భవించింది.

- బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించడమే ప్రతి దేశభక్తుని కర్తవ్యమన్న స్పష్టమైన అవగాహనతో సీపీఐ(ఎం) తన ఎన్నికల ప్రణాళికను భారతదేశ ప్రజల ముందుంచుతోంది. ఈ సమిష్టి కర్తవ్యాన్ని బలోపేతం చేసేందుకు, కేంద్రంలో లౌకికవాద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో సాయపడేందుకు తన శక్తివంచన లేకుండా పాటు పడుతుందని సీపీఐ(ఎం) ప్రతిన చేస్తోంది. ఇందుకు గానూ, ప్రజానుకూల విధానాలకు హామీ కల్పించేందుకు గానూ పార్లమెంట్‌లో సీపీఐ(ఎం) బలమైన ఉనికిని కలిగివుండడం అత్యవసరం.
- రాజకీయాలు, రాజ్యం, ప్రభుత్వం, పాలన నుండి మతాన్ని వేరు చేయాలన్న సూత్రం పట్ల తన నిబద్ధతను ప్రకటిస్తూ, దీని కోసం రాజీలేని పోరాటం సాగిస్తామని సీపీఐ(ఎం) ప్రతిన చేస్తోంది. విద్వేష ప్రసంగాలు, నేరాలకు వ్యతిరేకంగా చట్టం కోసం పోరాడుతుంది. సీఏఏను రద్దు చేసేందుకు కూడా కట్టుబడి వుంది.



- యూఏపీఏ, పీఎంఎల్ఏ వంటి అన్ని నిరంకుశ చట్టాలను రద్దు చేసేందుకు సీపీఐ(ఎం) నిలబడుతుంది. స్వతంత్ర సంస్థల స్వయంప్రతిపత్తిని పరిరక్షిస్తూ, బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడానికి, ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు కట్టుబడి వుంది.
- భారతదేశ ఆర్థిక సార్వభౌమాధికారాన్ని కాపాడే విధానాలకు సిపిఎం కట్టుబడి వుంది. ప్రభుత్వరంగ ప్రయివేటీకరణను పునస్సమీక్షించి, తిప్పికొట్టాలి. కుబేరులపై పన్ను విధించడంతో పాటూ సాధారణ సంపద పన్నును, వారసత్వ పన్నును కూడా చట్టబద్ధం చేయాల్సి వుంది. ప్రస్తుత లేబర్ కోడ్‌ల స్థానంలో కార్మికుల హక్కులు ప్రతిబింబించేలా కార్మిక అనుకూల చట్టాలు వుండాలి. స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధమైన హామీ కల్పించడం ద్వారా భారతదేశ రైతాంగానికి భద్రత కల్పించడంపైనే ఆహార భద్రత ఆధారపడి వుంటుంది.

పని హక్కును రాజ్యాంగ హక్కుగా చేర్చాలని సీపీఐ(ఎం) కోరుతోంది. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి. అదనంగా ఉద్యోగాలను సృష్టించగలిగేలా ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసి, విస్తరించాలి. ఎంజిఎన్ఆర్ఇజిఎకు బడ్జెట్‌లో కేటాయింపులను రెట్టింపు చేయాలి. పట్టన ఉపాధికి హామీ కల్పిస్తూ కొత్త చట్టాన్ని రూపొందించాలి. నిరుద్యోగ భృతిని కల్పించాలి. ఉపాధి నష్టంతో కూడిన వృద్ధికి సంబంధించిన ప్రస్తుత విధానాల్లో మార్పు తీసుకురావడం ద్వారా భారతదేశ ప్రజల లాభాలను నాశనం చేయడాన్ని తప్పనిసరిగా మార్చాలి.

- సార్వజనీన విద్యా హక్కును బలోపేతం చేయాలి, ఉన్నత విద్య ప్రయివేటీకరణను ఆపాలి.
- విద్యా రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు జిడిపిలో కనీసం ఆరు శాతానికి పెంచాలని సీపీఐ(ఎం) కోరుతోంది. వాణిజ్యీకరణ, మతతత్వకరణ, కేంద్రీకరణ విధానాలను తిప్పికొట్టడానికి కట్టుబడి వుంది.
- ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల కోసం చట్టాన్ని రూపొందించేందుకు సీపీఐ(ఎం) కట్టుబడి వుంది. ఎలాంటి నీరుగార్చకుండా రిజర్వ్‌డ్ పోస్టుల్లో ఖాళీల తక్షణ భర్తీకి, ఆదివాసీల రాజ్యాంగ, చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు, సాంస్కృతిక సమీకరణ ముగింపునకు కట్టుబడి వుంది. దేశంలో ఓబీసీలపై సక్రమ డేటాను పొందడానికి గానూ ఎన్నాళ్ళగానో చేపట్టాల్సి వున్న 2021 సాధారణ జనగణనతో పాటూ కుల గణన కూడా నిర్వహించడం అవసరం. మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లను తక్షణమే అమలు చేసేందుకు, నేరాల్లో మహిళా బాధితులకు న్యాయం అందించే క్రమాలను బలోపేతం చేయడానికి సీపీఐ(ఎం) కట్టుబడి వుంది.
- ఎన్నికల వ్యవస్థలో ధనబల వినియోగాన్ని అణచివేసేందుకు అత్యవసరంగా ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని సీపీఐ(ఎం) కోరుతోంది. ఇందుకు గానూ, ఎన్నికలకు ప్రభుత్వ నిధులనే ఉపయోగించాలని పార్టీ కోరుతోంది. రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు విరాళాలు ఇవ్వడాన్ని నిషేధించాలని కోరుతోంది. ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరిచేందుకు కార్పొరేట్లు విరాళాలు ఇవ్వాలి. అటువంటి విరాళాలన్నీకూడా ప్రభుత్వ ఎన్నికల నిధిలో జమ చేయాలి. వాటిని ప్రభుత్వ నిధులుగా ఉపయోగించాలి.
- 370వ అధికరణ ద్వారా జమ్మూ కాశ్మీర్‌కు మంజూరైన స్వయం ప్రతిపత్తి హెూదాకు సీపీఐ(ఎం) కట్టుబడి వుంది. జమ్మూ కాశ్మీర్ ప్రజల హక్కుల పరిరక్షించేందుకు గానూ ప్రతి వేదికను ఇందుకోసం ఉపయోగించుకోవడానికి సిపిఎం నిబద్ధతతో వుంది. రాష్ట్ర అసెంబ్లీకి తక్షణమే ఎన్నికలు నిర్వహించడానికి సీపీఐ(ఎం) కట్టుబడి వుంది. అలాగే ఈ దిశగా మొదటి చర్యగా పూర్తి స్థాయి రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలని కూడా కోరుతోంది.

మన దేశ ప్రయోజనాలను నెరవేర్చే అలీన విదేశాంగ విధానానికి సీపీఐ(ఎం) కట్టుబడి వుంది. మన దేశ భద్రతకు సంబంధించిన ప్రతి కోణాన్ని పరిరక్షించుకుంటూనే మన పొరుగు దేశాలతో సత్సంబంధాలు వుండాలని భావిస్తోంది.

- ప్రజల జీవన ప్రమాణాలు అత్యంత దయనీయంగా దిగజారిపోవడాన్ని దృష్టిలోవుంచుకుని ఆశ్రిత పక్షపాతం, పెట్టుబడిదారీవాదం, మతం-కార్పొరేట్ సంబంధాలకు సంబంధించిన ప్రస్తుత దిశా నిర్దేశాన్ని పూర్తిగా సవరించాలి. "
- సీపీఐ(ఎం) ప్రత్యామ్నాయ విధానాలను ఎన్నికల ప్రణాళిక రెండో భాగంలో ప్రజల ముందు సవివరంగా వుంచుతామని పేర్కొంది.

లీగల్ నోటీసులకు భయపడం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ ఇచ్చిన లీగల్ నోటీసులకు భయపడబోమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి చెప్పారు. వాటిపై కేటీఆర్‌కు పరిజ్ఞానం లేదని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మీడియా కథనాలను చూసి విచారణ జరపమంటూ తాము డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే అనుమానం ఉందనీ, అందుకే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. టాస్క్‌పోర్స్ వాహనాల్లో డబ్బులు చేరవేశామంటూ రిమాండ్‌లో ఉన్న పోలీసు అధికారులు చెప్పారని గుర్తు చేశారు.

ప్రభుత్వ వాహనాలను సొంతానికి ఉపయోగించారనే కారణంగా గతంలో ఇందిరాగాంధీపై అనర్హత వేటు వేశారని తెలిపారు. దీని ప్రకారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ అనర్హులే అవుతారని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ. 2500 కోట్లు ఢిల్లీకి కప్పం కట్టారన్న కేటీఆర్ అన్న మాటలకు తాము కూడా లీగల్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. తీవ్రవాదుల కదలికలను అంచనా వేసేందుకు ఫోన్ ట్యాపింగ్ చేస్తారనీ, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేసిందని విమర్శించారు. ఆయన ఆదేశాల మేరకే ఆనాడు ఫోన్లు ట్యాపింగ్ చేశారని ఆరోపించారు.

కాంగ్రెస్‌లో చేరిన నిజాంపేట్ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి దంపతులు గురువారం ముఖ్యమంత్రి నివాసం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఇన్‌చార్జి కోలన్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మేయర్‌తో పాటు కాంగ్రెస్‌లో చేరిన వారిలో సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ , కార్పొరేటర్లు చిట్ల దివాకర్, ఇంద్రజిత్ రెడ్డి, ఊటుకూర్ సురేష్ రెడ్డి, రాజేశ్వరీ చౌదరీ, వెంగయ్య చౌదరీ, గంగెయ్యల శ్రీనివాస్ యాదవ్, ఆవుల ప్రసన్న జగదీష్ యాదవ్, ఆవుల జగదీష్ యాదవ్, కో ఆప్షన్ సభ్యురాలు వాణి స్టీఫెన్ పాల్, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఆమె భర్త నీలా గోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టారు. నిజాంపేట్ రహదారిపై హనుమాన్ ఆలయం వద్ద కార్యకర్తలు మేయర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

హక్కుల కోసం నిరంతరం పోరాటాలు

- జి నాగయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నేత సునీత్ చోప్రా అనీ, ఆయన పోరాట స్ఫూర్తితో బలమైన భూ పోరాటాలు- కూలి పోరాటాలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరముందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జి నాగయ్య అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో సునీత్ వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ అటవీ హక్కుల, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయకుండా బీజేపీ సర్కారు తొక్కి పట్టిందని విమర్శించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు అధ్యక్షతన సభలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, హరిబండి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ప్రసాద్, మహిళ కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పన పద్మ, మూడ్ శోభన్ పి.ఆశయ్య కోట రమేష్ ఆర్. ఆంజనేయులు, రాహుల్ పాల్గొన్నారు.

నేతన్నలపై కక్ష కట్టిన కాంగ్రెస్ సర్కారు

- వారిని ఆదుకోవాలి : సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



నేతన్నలపై కాంగ్రెస్ సర్కార్ కక్ష కట్టిందనీ, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. బీఆర్ఎస్ పాలనలో పదేండ్లు పండుగలా కళకళలాడిన చేనేతరంగం.. కాంగ్రెస్ రాగానే మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు.

2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో.. మళ్లీ కాంగ్రెస్ వచ్చి నాలుగునెలలు గడవకముందే అదే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరి వల్ల గత నాలుగు నెలలుగా నేతన్నలు చేనేత పనులకు దూరం అవడంతో పాటు, పవర్ లూమ్స్ పూర్తిగా బంద్ అయ్యాయని తెలిపారు. చేనేత కార్మికులు, పవర్ లూమ్ ఆసాములతోపాటు కార్మికులు రోడ్డునపడటంతో.. పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ముందు చూపు లేకపోవడం వల్ల వేలాది మంది నేతన్నలు, పవర్ లూమ్ కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నా .. ప్రభుత్వానికి కనీస కనికరం లేదని వాపోయారు. తమకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు.. ప్రతినిత్యం దీక్షలు, ధర్నాలు, నిరసనలతో.. ఏదో ఒక రూపంలో తమ ఆందోళన కొనసాగిస్తున్నప్పటికీ సర్కారులో ఏమాత్రం చలనం లేదని విమర్శించారు. ఆదుకోవాల్సిన అధికార పార్టీ నేతలే కార్మికులను అవమానించేలా మాట్లాడటం.. వారి మనోస్థైర్యాన్ని మరింత దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి వ్యాఖ్యలు ప్రతి కార్మికుని గుండెను గాయపరిచాయని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తడుక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఉరేసుకుని తనువు చాలించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యగానే నేతన్నలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ నేతలు

- రూ.1.67కోట్ల విద్యుత్ బకాయిలు చెల్లించనందుకే...

నవతెలంగాణ-ఉప్పల్

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో నేడు సన్ రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే. అయితే మ్యాచ్‌కు ముందే ఉప్పల్ స్టేడియం నిర్వాహకులకు షాక్ తగిలింది. చాలా రోజులుగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు స్టేడియానికి విద్యుత్ నిలిపివేశారు. రూ.1.67 కోట్ల బకాయిలను సంబంధించి ఇప్పటికే నోటీసులు ఇచ్చినా హెచ్‌సీఏ అధికారులు స్పందించలేదని అధికారులు చెబుతున్నారు. ఎస్ఈ రాములు ఈ విషయం పై మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లులు కట్టకుండా విద్యుత్ వినియోగించారని తెలిపారు. దీనిపై 2015లోనే కేసు నమోదు చేశామని, 15 రోజుల క్రితం నోటీసులు పంపామని చెప్పారు. అయితే ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ పాసులు ఇవ్వనందుకే ఉప్పల్ స్టేడియంకు పవర్ కట్ చేశారని హెచ్‌సీఏ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జనరేటర్ల సహాయంతో విద్యుత్ వినియోగిస్తున్నట్టు హెచ్‌సీఏ అధికారులు తెలిపారు.

'బిల్డాక్స్'కు 'రెరా' ట్రిబ్యునల్ ఝలక్

- రూ.3.96 కోట్ల భారీ జరిమానా
- తప్పుడు ప్రచారంతో రియల్ మోసాల ఫలితం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సామాన్య, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలలను ఆసరా చేసుకొని రియల్ ఎస్టేట్ మోసాలకు పాల్పడుతున్న హఫీజ్‌పేటలోని బిల్డాక్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్‌రెరా) ట్రిబ్యునల్ ఝలక్ ఇచ్చింది. ఆ సంస్థ కార్యకలాపాలపై కన్నెర్ర చేసింది. గతంలో ఎన్నడూ లేనట్టు రూ. 3 కోట్ల 96 లక్షల 39 వేల 600 జరిమానాగా విధించింది. గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని 'రెరా ట్రిబ్యునల్' కార్యాలయంలో 'బిల్డాక్స్' సంస్థ మోసాలపై రెండోసారి విచారణ జరిగింది. ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ, సభ్యులు కే శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ జన్ను నేతృత్వంలో ఈ విచారణ జరిగింది. 'బిల్డాక్స్' సంస్థ హఫీజ్‌పేటలోని సర్వే నెంబర్ 80లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెంచర్లు వేసి, అమ్మకానికి పెట్టింది. దీనిపై 'రెరా'కు పలు ఫిర్యాదులు అందాయి. పలుమార్లు నోటీసులు జారీ చేశారు. ఆ సంస్థ స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. ఫేస్‌బుక్‌లో ఆ సంస్థ ఇస్తున్న ప్రకటనను నిలిపివేయాలని గతంలోనే 'రెరా ట్రిబ్యునల్' ఆదేశించింది. ఆ ఉత్తర్వుల్ని ధిక్కరిస్తూ, ఇప్పటికీ ఆ ప్రకటనను ఫేస్‌బుక్‌లో 'బిల్డాక్స్' సంస్థ కొనసాగిస్తూనే ఉంది. గతంలో ఫిర్యాదుదారులు, బిల్డాక్స్ ప్రతినిధులను పిలిచి తప్పులు సవరించుకొనేందుకు ట్రిబ్యునల్ పలు అవకాశాలు ఇచ్చింది. అయినా బిల్డాక్స్ యాజమాన్యం 'రెరా' ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రజలకు తప్పుడు సమాచారం చేరవేస్తూ, వ్యక్తుల నుంచి నగదు వసూళ్ళకు పాల్పడుతున్నట్లు గ్రహించిన 'రెరా' చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, గురువారం తుది విచారణ జరిపి భారీ జరిమానా విధించింది. దీనిపై బిల్డాక్స్ తరఫు న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయడానికి మూడు వారాల సమయం కావాలని కోరారు. దీన్ని రెరా ట్రిబ్యునల్ తిరస్కరించి, తుది ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎలాంటి ప్రకటనలు, మార్కెటింగ్, విక్రయాలు కొనసాగించరాదనీ, ఫేస్‌బుక్ ప్రకటనలు వెంటనే తొలగించాలని ఆదేశించింది.

ఉప్పల్ స్టేడియానికి పవర్ కట్..పునరుద్ధరణ

- రూ.1.67కోట్ల విద్యుత్ బకాయిలు చెల్లించనందుకే...

నవతెలంగాణ-ఉప్పల్

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం సన్ రైజర్స్



హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే. అయితే మ్యాచ్‌కు ముందే ఉప్పల్ స్టేడియం నిర్వాహకులకు షాక్ తగిలింది. చాలా రోజులుగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు స్టేడియానికి విద్యుత్ నిలిపివేశారు. రూ.1.67 కోట్ల బకాయిలను సంబంధించి ఇప్పటికే నోటీసులు ఇచ్చినా హెచ్‌సీఏ అధికారులు స్పందించలేదని అధికారులు చెబుతున్నారు. ఎస్ఈ రాములు ఈ విషయం పై మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లులు కట్టకుండా విద్యుత్ వినియోగించారని తెలిపారు. దీనిపై 2015లోనే కేసు నమోదు చేశామని, 15 రోజుల క్రితం నోటీసులు పంపామని చెప్పారు. అయితే ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ పాసులు ఇవ్వనందుకే ఉప్పల్ స్టేడియంకు పవర్ కట్ చేశారని హెచ్‌సీఏ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జనరేటర్ల సహాయంతో విద్యుత్ వినియోగిస్తున్నట్టు హెచ్‌సీఏ అధికారులు తెలిపారు.చర్చలు జరిపాక విద్యుత్‌ను పునరుద్ధరించినట్టు స్టేడియం వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ నేతలు

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఎంపీ రంజిత్‌రెడ్డి నేతృత్వంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున హస్తం గూటికి చేరారు. చేవెళ్ల ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా రంజిత్‌రెడ్డితో కలిసి పని చేసేందుకు పార్టీలో చేరినట్టు స్పష్టం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని వెల్లడించారు.

పార్టీలో చేరిన వారిలో సరూర్‌నగర్ మాజీ జెడ్పీటీసీ జిల్లెల నరేందర్‌రెడ్డి, కందుకూరు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, బీజేపీ సీనియర్ నేత సిద్దాల దశరథ, బచ్చన బోయిన నరసింహయాదవ్, కార్పొరేటర్ బచ్చన బోయిన పద్మ అనిత నాయక్, తుక్కుగూడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భవానీ వెంకటరెడ్డి, జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షులు ఇక్బాల్ బిన్ ఖలీఫా, జల్‌పల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యూసుఫ్, కౌన్సిలర్ తేజస్విని శ్రీకాంత్, కొండల్, యాదవ్, కౌన్సిలర్, అవల్గీ, మాజీ సర్పంచ్ జిల్లెల్ల వనిత నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు. .

గ్యారెంటీ లేని మోడీ హామీ

గ్రామీణ, వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం

- ఉపాధి ఉండదు.. తగిన వేతనమూ రాదు
- బీజేపీ పాలనలో సంక్షేమం, సబ్సిడీ, స్కీమ్స్‌పై చిన్న చూపు
- కార్పొరేట్లు, బడా వ్యాపారవేత్తలు, ప్రయివేటు వ్యక్తులే ప్రధానం
- సామాజికవేత్తలు, మేధావులు, నిపుణుల ఆందోళన





బీజేపీ అనుకూల ప్రచారాలు

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో అతి త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగబోతు న్నాయి. ఎన్నికలంటే ప్రభుత్వ పనితీరు, ఎన్నికల మ్యానిఫెస్టోలోని వారి వాగ్దానాలు, వాటి అమలుపై అంచనాలు, ఆలోచనలు చేసే సమయమిది. మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం భారత్‌ను 'ప్రజాస్వామ్య తల్లి'గా అభివర్ణిస్తున్నది. అయితే ఓటర్లు, పౌరులు వారు అనుభవిస్తున్న నిజమైన సమస్యలు, వారి హక్కులు, వాటికి జరుగుతున్న ఉల్లంఘనలు మాత్రం ఎన్నికల ప్రచారంలో కనబడకపోవటం గమనార్హం. గత పదేండ్ల మోడీ పాలనలో, అధికార పార్టీ తన బలమైన ప్రచార యంత్రాంగాన్ని, కార్పొరేట్ నియంత్రణలో ఉన్న మీడియాను ఉపయోగించి బీజేపీకి అనుకూలంగా ఒక కథనాన్ని నిర్మించు కోవటంలో విజయం సాధించింది. బాగా చదువుకున్న యువత, మధ్యతరగతి వారు కూడా ఇలాంటి కథనాల నిజమని నమ్ముతుండటం గమనార్హం.

న్యూఢిల్లీ : గతేడాది నుంచి ప్రధాని నోటి నుంచి వినిపిస్తున్న మాట 'మోడీ గ్యారెంటీ'. ఏ రాష్ట్రంలో ప్రచారానికి వెళ్లినా.. ఈ రెండు పదాలను మోడీ ఉపయోగిస్తున్నారు. అయితే, రాజ్యాంగ విరుద్ధ ఎన్నికల బాండ్ల ద్వారా కార్పొరేట్ల నుంచి విరాళాలు, దోపిడీల నుంచి సేకరించిన లక్షలాది నిధుల సహాయంతో పౌరుల వాస్తవికతను పాతిపెట్టే ప్రయత్నం జరుగుతున్నదని సామాజిక కార్యకర్తలు, మేధావులు, విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా, గ్రామీణ, వ్యవసాయ కార్మికుల కోసం 'మోడీ హామీ' ప్రచారంలో కొన్ని ప్రకటనలు, గ్రౌండ్ రియాలిటీని బట్టి చూస్తే పరస్పర విరుద్ధంగా ఉన్నాయని చెప్తున్నారు. మొత్తంగా చూసుకుంటే మోడీ పాలనలో వారు తీవ్ర అన్యాయానికి, నిర్లక్ష్యానికీ గురయ్యారని అంటున్నారు. మోడీ హామీకే గ్యారెంటీ లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.

ప్రజల ఆదాయాన్ని పెంచే 'మోడీ హామీ' ఏమైంది?

కేంద్రం అవలంబిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు వ్యవసాయ సంక్షోభాన్ని తీవ్రం చేస్తున్నాయి. ఫలితంగా గ్రామీణ భారత్‌లో భారీ నిరుద్యోగం ఏర్పడుతున్నది. టెక్నాలజీ వినియోగంతో వ్యవసాయ రంగంలో ఉపాధి కనిష్ట స్థాయికి తగ్గింది. ప్రధాన వ్యవసాయ, వ్యవసాయేతర వృత్తుల వేతనాలు 2013-14 నుంచి 2018-19 వరకు సంవత్సరానికి మూడు శాతం తగ్గాయి. గ్రామీణ వేతనాలు క్షీణించడానికి ప్రధాన కారణం నోట్ల రద్దు, జీఎస్టీ (వస్తువులు, సేవల పన్ను), మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) సహా అనేక సామాజిక భద్రతా పథకాలకు బడ్జెట్ కేటాయింపులో తగ్గింపు, సబ్సిడీలలో కోత అని కార్మిక సంఘాల నాయకులు, సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు. కరోనా మహమ్మారి తర్వాత లాక్‌డౌన్ సమయం నుంచి అఖిల భారత స్థాయిలో ప్రధాన గ్రామీణ వృత్తుల వేతనాల పెరుగుదలలో గణనీయమైన క్షీణత కనిపించిందని గణాంకాలు చెప్తున్నాయి.

వేలెత్తి చూపుతున్న పలు నివేదికలు

ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్(ఐఎల్ఓ) అధ్యయనం కూడా ఇటీవలి సంవత్సరాలలో గ్రామీణ భారతీయ వేతనాల కొనుగోలు శక్తిలో ప్రతికూల ధోరణులను ఎత్తి చూపింది. తన ఆర్థిక సర్వే 2022-23లో, ఏప్రిల్-నవంబర్ (2022) మధ్య పెరిగిన ద్రవ్యోల్బణం కారణంగా నిజమైన గ్రామీణ వేతనాలు (అంటే ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేయబడిన గ్రామీణ వేతనాలు) ప్రతికూల వృద్ధిని కేంద్ర గణాంకాలే హైలైట్ చేశాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) ఇటీవల విడుదల చేసిన అధ్యయనంలో మూడు బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్, యూపీలలో కార్మికులు జాతీయ సగటు కంటే చాలా తక్కువ రోజువారీ వేతనాలు పొందుతున్నారని వెల్లడించింది. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లోని వ్యవసాయ కార్మికులకు రోజువారీ వేతనం రూ. 241.9. ఇది జాతీయ సగటు రూ.345.7 కంటే రూ. 100 తక్కువ కావటం గమనార్హం.

'ఉపాధి'పై తీవ్ర నిర్లక్ష్యం

'ఉపాధి' హామీ చట్టాన్ని మోడీ సర్కారు నిర్వీర్యం చేస్తున్నదనీ, బీజేపీ పాలనలో ఈ పథకానికి నిధులు సరిపోవటం లేదని గణాంకాలు సూచిస్తున్నాయి. దీంతో కార్మికులకు తక్కువ వేతనాలు అందుతున్నాయని యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యావేత్తలు, కార్యకర్తల కన్సార్టియం అయిన లిబ్‌టెక్ ఇండియా అందించిన డేటా ప్రకారం.. గత 21 నెలల్లో సిస్టమ్ నుంచి 7.6 కోట్ల జాబ్ కార్డులు తొలగించబడ్డాయి. 2013-14లో గ్రామీణ ఉపాధి చట్టం మొత్తం బడ్జెట్‌లో 1.98 శాతం వాటాను కలిగి ఉన్నది. మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది 2023-24 మొత్తం బడ్జెట్‌లో 1.33 శాతానికి తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) సవరించిన అంచనాలతో పోల్చితే కేటాయింపుల్లో పెరుగుదల మాత్రం శూన్యం కావటం గమనార్హం.

గ్రామీణ ప్రజలందరికీ సామాజిక భద్రత లేదు

తక్కువ ఆదాయం, భారీ నిరుద్యోగం ఉన్న పరిస్థితుల్లో, వ్యవసాయ కార్మికుల జీవితాలు.. సంక్షేమ పథకాలు, సాంఘిక సంక్షేమ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. కానీ, మోడీ పాలనలో సంక్షేమ పథకాలు నీరుగారాయి. ప్రభుత్వ సంస్థలు కార్పొరేట్లకు దాసోహమన్నాయి. లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్(ఎల్డీఎఫ్) నేతృత్వంలోని కేరళ ప్రభుత్వం మినహా ఆరోగ్యం, విద్యతో సహా ప్రభుత్వ రంగాన్ని భారీగా ప్రయివేటీకరించడంతో మన వర్తమానం, భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని నిపుణులు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో సంక్షోభం ఎంత తీవ్రమైందంటే వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు బలవుతున్నారని వారు చెప్తున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ) నివేదిక ప్రకారం.. గతేడాది 5,563 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మొత్తమ్మీద, 2014 నుంచి 40,685 మంది వ్యవసాయ కూలీలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ ఆందోళనకరమైన పరిస్థితిని పరిష్కరించడంలో మోడీ సర్కారు విధానాలు ఘోరంగా విఫలమయ్యాయని నిపుణులు అంటున్నారు.

పార్లమెంటరీ కమిటీల నివేదికలనూ పట్టించుకోని వైనం

గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన నివేదికలో (ఫిబ్రవరి 8, 2024న పార్లమెంటు ముందుంచారు) 2008 నుంచి వేతనాల పరిమాణాన్ని గమనిస్తే.. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు సరిపోలేదని గుర్తించాలని సిఫారసు చేసింది. ఈ తరుణంలో, వ్యవసాయ కార్మికులు, తాపీపని, ఇతర పనుల్లో నిమగ్నమైన ఇతర కూలీలు ఉపాధి హామీ కింద హామీ ఇవ్వబడిన వేతనం కంటే ఎక్కువ రోజువారీ వేతనం పొందుతున్నారు. స్టాండింగ్ కమిటీ కనుగొన్న అంశాలను, సిఫారసులను మోడీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఎంజీఎన్ ఆర్ఈజీఏను సూత్రప్రాయంగా వ్యతిరే కిస్తున్న బడా కార్పొరేట్ సంస్థలు, భూస్వా ముల ప్రయోజనాల కోసం పని చేస్తున్నదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.


అందరికీ సమాన వనరుల వాటా ఏది?

సమాజంలోని అన్ని వర్గాల వారికి వనరులలో వాటా ఇస్తున్నారని బీజేపీ ప్రచార యంత్రాంగం చాలా ప్రచారం చేస్తున్నది. భూమిలేని కూలీలు, ఇతర పేదలు ఏండ్ల తరబడి ఎదురు చూస్తున్న అతి ముఖ్యమైన భూమిని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నదని సామాజికవేత్తలు పలు ఘటనలను ఉదహరిస్తున్నారు. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) డేటా ప్రకారం 2018-19లో దాదాపు 41 శాతం గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయ భూమి లేదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్) డేటా ప్రకారం 2015-16లో 47 శాతం గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయ భూమి లేదు. భారత్‌లోని గ్రామాల్లో కొద్దిమంది చేతుల్లో భూమి కేంద్రీకృతం కావటం ఒక భయంకరమైన వాస్తవం. 2018-19కి సంబంధించిన ఎన్ఎస్ఎస్ఓ డేటా ప్రకారం.. 20 శాతం గ్రామీణ కుటుంబాలు మొత్తం భూమిలో 76 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ప్రభుత్వం అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో వివిధ అవసరాల కోసం భూములను పూలింగ్ చేస్తున్నదనీ, ప్రాథమిక లబ్దిదారులు కార్పొరేట్లు, బడా వ్యాపారవేత్తలే అవుతున్నారని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్లీజ్.. పార్టీని వీడొద్దు..

మాట్లాడుకుందాం రండి...

- గ్రేటర్ ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ అగ్రనేతల విజ్ఞప్తి
- పలువురితో ప్రత్యేకంగా భేటీ అయిన కేటీఆర్
- నాగర్ కర్నూల్‌పై స్పెషల్ ఫోకస్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్... ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపటంతో ప్రధాన ప్రతిపక్షం అలెర్టయింది. శనివారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో అధికార పార్టీ భారీ బహిరంగ సభను నిర్వహించనున్న నేపథ్యంలో... అదే రోజు బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు మూడు రంగుల కండువా కప్పుకునే అవకాశముందంటూ గుసగుసలు వినబడుతున్నాయి. ఈ క్రమంలో గులాబీ పార్టీ బుజ్జగింపుల పర్వానికి శ్రీకారం చుట్టింది. 'కష్ట కాలంలో పార్టీని వీడొద్దు.. ప్లీజ్..మీ ఆలోచనను విరమించుకోండి...' అంటూ వారికి విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ ఓ మునిగిపోయే పడవ, రేవంత్ ఓ విఫల ముఖ్యమంత్రి అని చెప్పటం ద్వారా నేతల గోడ దూకుళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తోంది. ఎప్పుడు ఏ నాయకుడు 'హ్యాండి'స్తాడో తెలియని పరిస్థితుల్లో ఉన్న బీఆర్ఎస్... పార్టీ మారతారనే చర్చ కొనసాగుతున్న నేతలతో సంప్రదింపులు మొదలుపెట్టింది. గతంలో జరిగిన తప్పులను సవరించుకుంటా మంటూ హామీనిచ్చింది. తద్వారా నేతలు 'చే'జారకుండా చూడాలంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో సికింద్రాబాద్, నాగర్ కర్నూల్ లోక్‌సభ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలతో ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. ముఖ్యంగా ఒక బీసీ ప్రజా ప్రతినిధితో కేటీఆర్ మంతనాలు జరిపినట్టు సమాచారం. ఆయన పార్టీని వీడితే జరిగితే నష్టం, లోక్‌సభ ఎన్నికల్లో ప్రభావంతోపాటు సదరు నేత ఎందుకు అలకబూనారనే విషయమై వర్కింగ్ ప్రెసిడెంట్ సీనియర్లతో ఆరా తీశారు. అందువల్ల ఆ బీసీ నేతను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమంటూ ఆయన చెప్పినట్టు తెలిసింది. మరోవైపు గెలిచే అవకాశమున్న సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలోని సీనియర్లు, ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ ప్రయోగించే అవకాశమున్నందున చాలా అలర్ట్‌గా ఉండాలంటూ కేటీఆర్ సూచించారు. ఒకవేళ అధికార పార్టీ అలాంటి చర్యలకు పాల్పడితే ఎలాంటి వ్యూహాన్ని అనుసరించాలనే దానిపై కూడా ఆయన చర్చించారు.

మరోవైపు వ్యాపారాలు, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ వ్యాపకమున్న ఇతర గ్రేటర్ ఎమ్మెల్యేలు కూడా తమ తమ అవసరాలు, అనివార్యత రీత్యా బీఆర్ఎస్‌ను వీడే అవకాశముందని ఆ పార్టీ అధిష్టానం భావిస్తోంది. అందువల్ల వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కేసీఆర్ ఆదేశించారు. వారితో చర్చించే బాధ్యతను ఆయన సీనియర్ నేతలకు అప్పగించినట్టు సమాచారం. దీంతోపాటు నాగర్ కర్నూల్ స్థానంపై కూడా బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించింది. అక్కడి నుంచి మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు టిక్కెట్ ఇచ్చిన విషయం తెలిసిందే. అందువల్ల ఆ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కారు పార్టీ... అక్కడి నేతలు, కార్యకర్తలు, ఇతర ప్రజా ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ కావాలంటూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాయకత్వానికి సూచించింది. త్వరలోనే అక్కడి నేతలతో కేటీఆర్ భేటీ కానున్నారు. ఆ స్థానంలో గులాబీ పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలున్నారు. వారితోపాటు మిగతా ముఖ్య నాయకత్వం పార్టీ మారకుండా చూడాలంటూ బీఆర్ఎస్ అధినేత వర్కింగ్ ప్రెసిడెంట్‌కు దిశా నిర్దేశం చేశారు.

బీజేపీ అవినీతి కథ @ వన్ క్లిక్!



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా బీజేపీ నేతలు చేస్తున్న అవినీతికి సంబంధించిన సమగ్ర సమాచారంతో కూడిన వెబ్‌సైట్. **www.corruptmodi.com** వెబ్‌సైట్ ఆంగ్ల అక్షర క్రమంలో ప్రతి అవినీతికి సంబంధించిన వివరణాత్మక వర్ణనను అందిస్తుంది. ఒక్కో అక్షరాన్ని క్లిక్ చేయగానే ఆర్థిక మోసాలకు సంబంధించిన వార్తాపత్రిక క్లిప్పింగ్‌లు తెరపై కనిపిస్తున్నాయి. అదానీ పోర్ట్ స్కామ్ గురించి వివరాలు లెటర్ ఎ క్లిక్ చేయగానే వస్తాయి. లెటర్ బిని క్లిక్ చేయగానే ఆరు ముఖ్యమైన స్కామ్‌ల వివరాలు మన ముందు సాక్షాత్కరిస్తాయి.. 2008లో శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బుందేల్‌ఖండ్ ప్యాకేజీ స్కామ్, 2016-2017లో ఛత్తీస్‌గఢ్‌లో బడ్జెట్ అవకతవకలపై కాగ్ నివేదిక, వసుంధరా రాజే ఆధ్వర్యంలో రాజస్థాన్‌లో బజ్రీ మైనింగ్ స్కామ్, బిట్‌కాయిన్ స్కామ్, భామా షా. స్కామ్ , గోవాలో రూ. 5 కోట్ల నిర్మాణ కుంభకోణాలకు సంబంధించిన సమగ్ర వివరాలు మన ముందుంటాయి. 'సి' ని క్లిక్ చేయగానే సుబిన్ ఇరానీ (కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ భాగస్వామి) చేసిన భూ కుంభకోణం ఉంది. 'డి' ని క్లిక్ చేసినప్పుడు, కర్నాటక బీజేపీ మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్ప బీజేపీ కేంద్ర కమిటీకి, అద్వానీ, మురళీ మనోహర్ జోషి, రాజ్‌నాథ్ సింగ్ , గడ్కరీలతో సహా నాయకులకు కోట్ల రూపాయలు చేతులు మారిన వైనానికి సంబంధించిన ఆదాయపు పన్ను శాఖ రికార్డుల బహిర్గతమవుతాయి.

సైట్ హోమ్ పేజీలో 2000 కరెన్సీలు ధరించిన నరేంద్ర మోడీ చిత్రం బీజేపీ అవినీతికి నిలువెత్తు తార్కాణం. 'ఎ' నుండి 'జెడ్'వరకు ఉన్న ఏ అక్షరంపై క్లిక్ చేస్తే , ఆ అక్షరంతో మొదలయ్యే అవినీతికి సంబంధించిన పూర్తి వివరాలు కనుగొనవచ్చు.




ఆస్తుల విలువ రూ. 20 కోట్లు

న్యూఢిల్లీ : తాను కేవలం రూ.20 కోట్ల ఆస్తులను మాత్రమే కలిగి ఉన్నట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తన అఫిడవిట్‌లో ప్రకటించారు. వయనాడ్ లోక్‌సభ స్థానం కోసం బుధవారం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించిన సంగతి తెలిసిందే. చరాస్తుల విలువ రూ.9 కోట్లు కాగా, స్వయంగా ఆర్జించిన స్థిరాస్తుల కొనుగోలు ధర రూ. 7 కోట్లుగా ప్రకటించారు. స్వయంగా సంపాదించిన చరాస్తుల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.9కోట్లుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వారసత్వంగా వచ్చిన ఆస్తుల విలువ రూ. 2కోట్లుగా తెలిపారు. అలాగే 49 లక్షల రూపాయల అప్పు ఉండగా, ప్రస్తుతం నగదు రూ. 55,000 ఉన్నట్లు అఫిడవిట్‌లో ప్రకటించారు.

కాగా, గత ఎన్నికల్లో మొత్తం ఆస్తుల విలువ రూ.15 కోట్లుగా ప్రకటించగా, 2014లో రూ.9.4 కోట్లుగా పేర్కొన్నారు.

తొలి దశ అభ్యర్థుల్లో...

18 మంది ఫిరాయింపుదారులే



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమరం ఈ నెల 19న ప్రారంభం కాబోతోంది. తొలి దశ ఎన్నికల్లో తలపడుతున్న అభ్యర్థుల్లో 18 మంది గత ఐదు సంవత్సరాల కాలంలో ఒకసారి లేదా అంతకంటే ఎక్కువ సందర్భాలలో పార్టీలు ఫిరాయించిన వారే. వీరిలో కొందరు సార్వత్రిక ఎన్నికలకు కొన్ని వారాలు లేదా నెలల ముందు కప్పగంతులు వేశారు. వీరిలో కొందరు రాజస్థాన్ నేతల వివరాలు తెలుసుకుందాం.

రాజస్థాన్‌లోని నాగర్ నుండి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి డాక్టర్ జ్యోతి మీర్థా 2009లో కాంగ్రెస్ టిక్కెట్‌పై అదే స్థానం నుండి బరిలో నిలిచి, బీజేపీ అభ్యర్థిపై 1.55 లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మీర్థా తాత నాథూరామ్ మీర్థా ఆరుసార్లు కాంగ్రెస్ పక్షాన లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2009 తర్వాత మీర్థా రెండుసార్లు నాగర్‌లో ఓటమి చవిచూశారు. చివరికి ఆమె కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి 2023 శాసనసభ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరిపోయారు. కేంద్ర దర్యాప్తు సంస్థల దూకుడు కారణంగానే మీర్థా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారని రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పీ) ఆరోపించింది. 2009లో రూ.3 కోట్లు ఉన్న ఆమె ఆస్తుల విలువ ఈ ఏడాది రూ.102 కోట్లకు చేరింది.

ఖీన్వ్‌సార్ స్థానం నుండి ఆర్ఎల్‌పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న హనుమాన్ బెనివాల్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2008 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసిన ఆయన 2013లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. 2018లో ఆర్ఎల్‌పీని ఏర్పాటు చేసి రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019లో ఆయన పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుంది. అయితే రైతుల ఆందోళన నేపథ్యంలో ఆ తర్వాత తెగతెంపులు చేసుకుంది. బెనివాల్‌కు నోటి దురుసు ఎక్కువ. బీజేపీలో ఉన్నప్పుడు వసుంధర రాజె నుండి ఎల్‌కే అద్వానీ వరకూ పలువురు పార్టీ నేతలపై అవినీతి ఆరోపణలు చేశారు. ప్రస్తుత భాగస్వామి కాంగ్రెస్‌ను కూడా ఆయన వదలడం లేదు. రాహుల్ పైనే విమర్శలు సంధించారు. 2008లో రూ.11 లక్షలుగా ఉన్న ఆయన ఆస్తులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి.

చురు లోక్‌సభ స్థానం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాహుల్ కశ్వాన్ 2014లో తొలిసారి ఎంపీగా గెలుపొందారు. బీజేపీ నాయకురాలు వసుంధర రాజెకు సన్నిహితుడిగా ఆయనకు పేరుంది. ఆయన పూర్వీకులందరూ బీజేపీ నేతలే. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కశ్వాన్‌కు బీజేపీ టిక్కెట్ నిరాకరించడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగారు. ఇక ఉదయ్ శంకర్ హజారికా లఖింపూర్ నుండి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారు. ఆయన ఒకప్పుడు బీజేపీలో ఉండేవారు. ఆ పార్టీ తరఫున మూడుసార్లు పోటీ చేసినా ఒక్కసారి కూడా విజయం వరించలేదు. దీంతో తాజాగా కాంగ్రెస్‌లో చేరి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. లఖింపూర్ నుండి మూడుసార్లు కాంగ్రెస్ ఎంపీగా గెలిచిన కేంద్ర మాజీ మంత్రి రాణి నారాకు ఈసారి నిరాశ ఎదురవడంతో ఆయన పార్టీకి గుడ్‌బై చెప్పారు.

కొత్త సీజన్ గోధుమలు కొనొద్దు

ట్రేడర్లకు భారత్ పిలుపు

నిల్వలు పెంచటం కోసమన్న ప్రభుత్వ వర్గాలు



న్యూఢిల్లీ : గోధుమల కొనుగోలు విషయంలో భారత ప్రభుత్వం ట్రేడర్లకు కీలక సూచనలు చేసింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) పెద్ద మొత్తంలో కొనుగోలు చేయటంలో సహాయపడటానికి స్థానిక రైతుల నుంచి కొత్త సీజన్ గోధుమలను కొనుగోలు చేయవద్దని ప్రపంచ, దేశీయ వాణిజ్య సంస్థలను కోరింది. సంబంధిత ట్రేడింగ్ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. చైనా తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద గోధుమ వినియోగదారు, పండించే దేశంగా ఉన్న భారత్.. 2022లో ఎగుమతులను నిషేధించింది. 2022, 2023లో ఉత్పత్తిని దెబ్బతీసిన పొడి వాతావరణం తర్వాత పెరిగిన స్టాక్‌లు, ధరలను తగ్గించడానికి చూస్తున్నది.

పెరుగుతున్న గోధుమల ధరలు స్థానిక సరఫరాలను పెంచడానికి ప్రభుత్వం రికార్డు స్థాయిలో విక్రయించవలసి వచ్చింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార సంక్షేమ కార్యక్రమానికి అవసరమైన నిల్వలలో తగ్గుదలకు దారితీసింది. రైతులు సాధారణంగా తమ ఉత్పత్తులను ఎఫ్‌సీఐ లేదా ప్రయివేటు వ్యాపారులకు విక్రయించే హోల్‌సేల్ మార్కెట్‌లకు దూరంగా ఉండాలని ప్రభుత్వం ప్రయివేట్ వ్యాపారులను కోరిందని కొందరు వ్యాపారులు, ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఏప్రిల్‌లో గోధుమలను కొనుగోలు చేయకూడదని ప్రభుత్వం ప్రయివేటు వ్యాపారులను అనధికారికంగా కోరింది. ఇలా కోరటం 2007 తర్వాత ఇది మొదటిసారి కావటం గమనార్హం. "మేము ఏప్రిల్‌లో కొనుగోలు చేయబోము. మేము మే వరకు వేచి ఉంటాము. ప్రాసెసర్‌లు, చిన్న వ్యాపారులు మినహా అందరూ ప్రభుత్వ మార్గాన్ని అనుసరించే అవకాశం ఉన్నది" అని ముంబయికి చెందిన ఒక వ్యాపారి చెప్పారు.

ఈ ఏడాది కనీసం 30 మిలియన్ మెట్రిక్(ఎంటీ) టన్నులు కొనుగోలు చేయాలనే ఎఫ్‌సీఐ యోచనలో ప్రయివేటు వ్యాపారులు అడ్డుపడకుండా చూడాలని ప్రభుత్వం గోధుమలు పండించే అగ్ర రాష్ట్రాలను కోరినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ధరల పెరుగుదలను నివారించటానికి ఏప్రిల్ నుంచి ప్రతి శుక్రవారం గోధుమ నిల్వలను ప్రకటించాలని కేంద్రం ఇప్పటికే వ్యాపారులు, ప్రధాన రిటైలర్లు, ఫుడ్ ప్రాసెసర్లను కోరింది. 2023లో ఎఫ్‌సీఐ స్థానిక రైతుల నుంచి 26.2 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమలను కొనుగోలు చేసింది. ఇది దాని లక్ష్యం 34.15 మిలియన్ మెట్రిక్ టన్నుల కంటే తక్కువ కావటం గమనార్హం. గతేడాది కొనుగోళ్లు తక్కువగా ఉన్నందున, ప్రభుత్వ గిడ్డంగులలో గోధుమ నిల్వలు మార్చి ప్రారంభంలో 9.7 మిలియన్ మెట్రిక్ టన్నులకు పడిపోయాయి. ఇది 2017 నుంచి కనిష్ట స్థాయి కావటం గమనార్హం.

20 గంటలు శ్రమించి..

చిన్నారికి ఊపిరి పోసి..

- కర్నాటకలో బోరుబావిలో పడ్డ పసివాడిని రక్షించిన సహాయక బలగాలు

బెంగళూరు : కర్నాటకలోని బోరుబావిలో పడిన ఏడాదిన్నర చిన్నారి కథ సుఖాంతమైంది. సహాయక బలగాలు 20 గంటలు శ్రమించి ఆ పసివాడిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. విజయపుర జిల్లా ఇండి తాలూకా లచ్యాణా గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ గ్రామానికి చెందిన సాక్షిత్ మజగొండన బుధవారం మధ్యాహ్నం ఆడుకుంటూ వెళ్లి తన ఇంటి సమీపంలోని తెరిచి ఉన్న బోరుబావిలో పడిపోయాడు. బావిలో నుంచి చిన్నారి ఏడుపు శబ్దాలు విన్న స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు చెప్పారు. సమాచారమందుకున్న ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం 6:30 గంటలకు ఈ రెస్క్యూ ఆపరేషన్ మొదలైంది. మొదట బోరుబావిలోకి కెమెరాను పంపగా.. 16 అడుగుల లోతులో చిన్నారి కాలు కదులుతూ కన్పించింది. వెంటనే పైప్‌లైన్ సాయంతో ఆక్సిజన్‌ను లోపలికి పంపించారు. ఆ తర్వాత బావి చుట్టూ తవ్వారు. దాదాపు 18 గంటల తర్వాత బాలుడి చిక్కుకొన్న ప్రాంతానికి రెస్క్యూ సిబ్బంది కాపాడారు.బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.



మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సిద్ధ గోని వెంకటేష్ గౌడ్ సోదరుడు శివ గౌడ్, సుష్మల వివాహానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు లిక్కీ ఊర్మిళా రెడ్డి, డివిజన్ నాయకులు గొడుగు శ్రీనివాస్, కొంద్ర శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, సాజిద్, జగన్మోహన్ రెడ్డి, కంచర్ల శేఖర్, మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి



మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గంలో వివిధ వివాహ శుభ కార్యాలకు హాజరై తిరిగి వెళ్తున్న సమయంలో మండల పరిధిలోని బైరగూడ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. రాచులూరు గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్ ఈ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపి ప్రమాదం జరిగిన తీరును బాధితులను అడిగి మరి తెలుసుకున్నారు. తర్వాత బాధితుడికి నీళ్ల అందించి.. వైద్యం కోసం ఆసుపత్రికి తరలించి ఎమ్మెల్యే సబితమ్మ తన మానవత్వాన్ని చాటుకున్నారు.



నవతెలంగాణ- బడంగ్‌పేట్

రూ.50 వేలకు మించి తీసుకెళ్లొద్దు



- 37 కేసులకు సంబంధించి రూ.1,01,49,370 విడుదల

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో ఇప్పటి వరకు 40 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. రూ.50వేలకు మించి ఆధారాలు లేని రూ.1,63,78,370లను జీడీసీకీ సిఫార్సు చేయగా అందులో, 37 కేసులకు సంబంధించి పూర్తి ఆధారాలు పరిశీలించి రూ.1,01,49,370లను విడుదల చేసినట్టు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో రూ. 50 వేలకు మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్నా, రవాణా చేస్తున్న నగదు రూ.1,63,78,370లను 40 మంది వ్యక్తుల నుంచి వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీజ్ చేయగా అందులో ఇప్పటివరకు జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సరియైన ఆధారాలు సమర్పించిన 37 మందికి రూ.1,01,49,370 నగదు విడుదల చేసినట్టు తెలిపారు. సీజ్ చేసిన నగదులో రూ.10లక్షలకు మించి పట్టుబడిన రూ.59,29,000 నగదుకు సంబంధించి రెండు కేసులను ఆదాయ పన్ను శాఖకు రెఫర్ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఒక కేసులో సీజ్ చేసిన 3 లక్షల రూపాయలు సరైన ఆధారాలు సమర్పించనందున విడుదల కాలేదని, సంబంధిత వ్యక్తులు సరైన ఆధారాలు సమర్పించి డబ్బు విడుదల చేసుకోవాలని సూచించినట్టు తెలిపారు. ఏమైనా సందేహాలుంటే జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మెన్ 9618888110, కమిటీ కన్వీనర్ మొబైల్ నంబర్ 9177872240లలో సంప్రదించాలని సూచించారు. నగదు సీజ్ అయితే పూర్తి ఆధారాలతో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఏర్పాటు చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కమిటీ పరిశీలించి సరైన ఆధారాలు ఉన్నట్టయితే సీజ్ చేసిన నగదును విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

'వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న
కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'



నవతెలంగాణ - చైతన్యపురి

వేసవి సెలవుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శివ కుమార్, జి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ శ్రీ చైతన్య, నారాయణ, కార్పొరేట్ ఇతర ప్రైవేట్ కళాశాలలో మొదటి సంవత్సరం పూర్తైన విద్యార్థులకు ఇంటర్ రెండో సంవత్సరం తరగతులు బోధిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు గత వారం వేసవి సెలవులు ప్రకటించిందన్నారు. కానీ జిల్లాలోని ప్రధానంగా మాదాపూర్ అయ్యప్ప సొసైటీ, ఎల్బీనగర్, దిల్‌సుఖ్ నగర్, హయత్‌నగర్, మెట్టు, ఆదిభట్ల, నారాయణ, శ్రీ చైతన్య, వశిష్ట, ఎస్ఆర్, రీజనెన్స్, ఆకాశ్, నానో, వంటి కార్పొరేట్ కళాశాలలతో పాటు మిగతా జూనియర్ కళాశాలలో ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా వేసవి తరగతులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. తరగతుల పేరిట ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. రోజు రోజుకూ వేసవి తాపం తీవ్రతరమవుతున్న అవేవీ పట్టించుకోకుండా విద్యార్థులను ప్రతి రోజు కళాశాలకు రావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలలో ఇంటర్ రెండవ సంవత్సరం తరగతులు బోధిస్తూ తరగతులకు హాజరు కాకపోతే టీసీలు ఇస్తామని విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్ల పేరుతో పెద్ద ఎత్తున ప్రచారాలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలపైన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వంశీవర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులు సర్దుబాటుతో గమ్యాన్ని చేరాలి

- మిథాని డిపో మేనేజర్ ఆంజనేయులు

నవతెలంగాణ - సంతోష్‌నగర్

బస్సు ఎక్కే సమయంలో ప్రయాణికులు సర్దుబాటు చేసుకొని తమ తమ గమ్యాలను చేరుకోవాలని మిథాని డిపో మేనేజర్ ఆంజనేయులు సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికులు సర్దుబాటు చేసుకుంటూ ఒకరినొకరు నెమ్మదిగా బస్సు ఎక్కుతూ తమ గమ్యాన్ని చేరాలని కోరారు. ఎండాకాలం పలు బస్ స్టాప్‌లలో బస్ షెల్టర్స్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట డిపో సూపర్వైజర్ స్వామి గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





రంజాన్ అంటేనే త్యాగానికి ప్రతీక

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

నవతెలంగాణ - సంతోష్‌నగర్

రంజాన్ అంటేనే త్యాగానికి ప్రతీక అని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గురువారం నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని అస్మాన్‌ఘడ్ సైదాబాద్ గాంధీనగర్ పలు కాలనీలల్లో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో కాలనీలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం సోదరులు అత్యంత కఠిన నియమ నిబంధనలతో రంజాన్ జరుపుకోవడం అభినందనీయమన్నారు. నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షతో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేయడం రంజాన్ మాసం గొప్పదనం అన్నారు. అనంతరం ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట్ నియోజకవర్గం కార్పొరేటర్లు, ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు, స్థానిక వార్డు మెంబర్ నరసింహ, సైదాబాద్ పరిధిలోని జామా మసీద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, ఎంఐఎం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నవతెలంగాణ - తుర్కయంజాల

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించ తలపెట్టిన అయ్యప్ప స్వామి వారి దేవస్థానానికి తుర్కయంజాల్ మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య రూ.2,00,116(రెండు లక్షల నూట పదహారు రూపాయలు)లను విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ త్రిదండి అస్త్రాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్, కళ్యాణా వెంకటేశ్వర్ల పండితులు, హనుమాన్ దీక్షితుల చేతుల మీదుగా ఆ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

నవతెలంగాణ - సంతోష్‌నగర్

కంచన్బాగ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సైదాబాద్ కుర్మగూడకు చెందిన టి.సాయిప్రకాష్(32) అనారోగ్యంతో మృతి చెందారు. చికిత్స నిమిత్తం సాయిప్రకాష్ ఈ నెల 1న నాంపల్లిలోని కేర్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సాయిప్రకాష్ మృతి చెందడంతో మృతుని కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరంగా అంత్యక్రియల కోసం ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి 20వేల రూపాయల చెక్కును అందజేశారు. అనంతరం సిటీ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ రెడ్డి తదితరులు మృతుని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న
విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- భారత్ జాగృతి విద్యార్థి నాయకుడు మునుకుంట్ల నవీన్ గౌడ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత్ జాగృతి విద్యార్థి నాయకుడు మునుకుంట్ల నవీన్ గౌడ్ కోరారు. గురువారం తెలంగాణ ఇంటర్ బోర్డ్ సెక్రటరీ శృతి ఓజాను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇంటర్ బోర్డ్ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి అయిన విద్యార్థులకు మార్చి 31 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ఇస్తున్నట్టు ప్రకటించిందన్నారు. అయితే ఇంటర్ బోర్డు ప్రకటనకు విరుద్ధంగా నారాయణ శ్రీ చైతన్య విద్యాసంస్థలు పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఎగ్జామ్స్ పూర్తయిన ఐదు రోజులకు ఆ నెల 4 నుంచి బ్రిడ్జ్ కోర్సుల పేరుతో తరగతులు నిర్వహిస్తామని ప్రముఖ దినపత్రికలో బహిరంగంగా పేపర్ యాడ్ ఇచ్చారన్నారు. దీని ద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారన్నారు. అలాగే విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను పుస్తకాలు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇలాంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు స్పందించిన ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ.. ఆ విద్యాసంస్థలపైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన తొమ్మిది మంది బీఆర్ఎస్ నాయకులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పార్టీలో చేరిన వారిలో జల్‌పల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఫర్హానాజ్, సయ్యద్ యూసుఫ్ పటేల్, జల్‌పల్లి మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కౌన్సిలర్ ఇక్బాల్ బిన్ ఖలీఫా, కొండల్ యాదవ్, సౌద్ అవల్గి, మజార్ అలీ, భాషమ్మ శ్రవణ్, షంషుద్దీన్, తుక్కుగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ భవాని వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్, సరూర్‌నగర్ మాజీ జడ్పీటీసీ జిల్లేల నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



నగరంలో 4.4కిలోల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో గంజాయిని సరఫరా చేస్తున్న ముఠాను వెస్టుజోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రూ.1,10,000 విలువగల 4.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపిన వవరాల మేరకు బోరబండకు చెందిన అనిల్ కుమార్ గుప్తా, హెచ్.మోషన్ ఖాన్, పర్వేజ్ ఖాన్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలని గంజాయిని సరఫరా చేస్తున్నారు. ఓడిస్సా నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేస్తున్న నిందితులు నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ జంగయ్య ప్రత్యేక నిఘా వేశారు. ఎస్ఐలు అరవింద్ గౌడ్, నవీన్ తదితరులతో కలిసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే దేశం అభివృద్ధి

- కొండా సంగీతా రెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

నేటి సమాజంలో మహిళల ఆర్థికాభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని కొండ సంగీతారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 31వ డివిజన్ బాలాజీ నగర్ కాలనీలో ఉన్న కమ్యూనిటీ భవనంలో మహిళలతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతా రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసమే కొండ విశ్వేశ్వర్ రెడ్డి రాజకీయాల్లోకి వస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

తన భర్త, చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళా సాధికారత, సమగ్రాభివృద్ధికి పాటుపడుతోందన్నారు. ప్రధాన మంత్రి మహిళల ఆర్థికాభ్వృద్ధి కోసం విశ్వకర్మ, ముద్రా లోన్స్‌ను మహిళల ఇచ్చి తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సహిస్తోందని కొనియాడారు. మహిళలు విద్య, వైద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో భాగం కావాలని సంగీతారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, పార్టీ నాయకులు శ్రావణ్ కుమార్, రాజ్ కుమార్, కార్పొరేషన్ మహిళా ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి, కావ్య, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శుక్రవారం | ఏప్రిల్ 05, 2024 | www.navatelangana.com

ఎండి.నిజాముద్దీన్‌కు అభినందనలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గ్రేటర్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేద్దామని గ్రేటర్ కాంగ్రెస్ మైనారిటీ విభాగం వైస్ చైర్మన్ ఎండి.నిజాముద్దీన్ అన్నారు. నూతనంగా పదవి స్వీకరించిన సందర్భంగా ఆయనను గురువారం సాయంత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు పూలమాలతో శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో కూడా ఉన్నత పదవులు పొందాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా చేయడమే లక్ష్యంగా ముందుకెళ్దాం అన్నారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు తైలం శ్రీనివాస్,ఏ. శ్రీని వాస్,గురువారెడ్డి,మొహమ్మద్ అబ్దుల్ రషీద్, మురళి చారి,కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకులు మొహమ్మద్ అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ నగరం భిన్న సంస్కృతులకు, సంప్రదాయాలకు నిలయాలు

- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

హైదరాబాద్ నగరం భిన్న సంస్కృతులకు, సంప్రదాయాలకు నిలయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద అన్నారు. గురువారం సాయంత్రం గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్ లో మైనారిటీ నాయకులు ఇబ్రహీం ఖాన్ అధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయనతోపాటు స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి లు ముఖ్య అతిథులుగా హాజరై ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా నెల రోజులపాటు ఉపవాస దీక్షలు నిర్వహిస్తూ ఆ అల్లాను కొలుస్తారని అన్నారు.ఇఫ్తార్ విందులు సోదర భావాలను పెంపొందిస్తాయన్నారు. నియోజకవర్గానికి చెందిన మైనారిటీ సోదరులు,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

25 ఏండ్ల యువతికి 9 గంటల పాటు శస్త్రచికిత్స

- మూడు వాల్వులు మార్చి.. ప్రాణాలు కాపాడిన వైద్యులు
- కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రి నిపుణుల ఘనత

నవతెలంగాన-సిటీబ్యూరో

మన శరీర అవయవాల్లో అన్నింటి కంటే ముఖ్యమైనది గుండె. దానికి ఏ చిన్న కష్టం వచ్చినా తట్టుకోలేము. అలాంటిది అందులో ఉండే నాలుగు ప్రధానమైన వాల్వులలో మూడింటిని మార్చాల్సిన పరిస్థితి వస్తే! అప్పుడు చికిత్స చేయడానికి అసాధారణ నైపుణ్యంతో పాటు నిబద్ధత కూడా అవసరం. 25 ఏండ్ల యువతికి ఇలాంటి సమస్యే తలెత్తినప్పుడు కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఇలాంటి నైపుణ్యం, నిబద్ధతతో శస్త్రచికిత్స చేసి ఆమె ప్రాణాలు కాపాడారు. మియాపూర్ ప్రాంతానికి చెందిన ఓ యువతికి విపరీతంగా ఆయాసం వస్తూ.. గట్టిగా నాలుగు అడుగులు కూడా వేయలేకపోయేవారు. దాంతో కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో చూపించారు. ఆమెకు అవసరమైన వైద్య పరీక్షలన్నీ చేయగా, ఆమె గుండెలోని మూడు ప్రధాన వాల్వులు.. మైట్రల్, ట్రైకుస్పిడ్, అయోటిక్‌లలో తీవ్రంగా లీకేజి ఉందని, అది ఆమె ఆరోగ్యాన్ని తీవ్రంగా



దెబ్బతీస్తోందని గుర్తించారు. బాధిత యువతికి 16 ఏండ్ల వయసులో ఒకసారి మైట్రల్ వాల్వ్ మార్చాల్సి వచ్చింది. అప్పట్లో ఒక టిష్యూ వాల్వును అమర్చారు. దాంతోపాటు ఒక రింగు సాయంతో ట్రైకుస్పిడ్ వాల్వుకు మరమ్మతులు చేశారు. అయితే టిష్యూ వాల్వులు చాలా త్వరగా పాడైపోతాయి. దానివల్ల మరిన్ని సమస్యలు తలెత్తుతాయి. దాంతో కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలోని చీఫ్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ నిసర్గ బృందం ఈ సంక్లిష్ట సమస్యకు శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది. మొత్తం మూడు వాల్వులు మార్చేందుకు 9 గంటల పాటు నిర్విరామంగా శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ఈసారి మెకానికల్ వాల్వుల తోనే మైట్రల్, ట్రైకుస్పిడ్, అయోటిక్ వాల్వులను మార్చారు. దాంతోపాటు ఆమెకు తీవ్రంగా ఉన్న పల్మనరీ హైపర్‌టెన్షన్‌కు కూడా చికిత్స చేశారు. శస్త్రచికిత్స చేసిన రెండో రోజే ఆమె నడవడం మొదలు పెట్టారు.

ఈ సందర్భంగా డాక్టర్ నిసర్గ మాట్లాడుతూ, "కిమ్స్ ఆస్పత్రిలోని మా వైద్యబృందం నైపుణ్యానికి, నిబద్ధతకు ఈ శస్త్రచికిత్స విజయమే ఒక తార్కాణం. ఇది చాలా సంక్లిష్టమైన శస్త్రచికిత్స. పైపెచ్చు యువతి వయసు చాలా తక్కువ, ఇంటి దగ్గర ఒక చిన్న బాబు కూడా ఉన్నాడు. ఆమెను సురక్షితంగా కుటుంబసభ్యులకు అప్పగించాల్సిన బహత్తర బాధ్యత మాపై ఉంది. అయితే, ఆమె చక్కగా కోలుకుని, నవ్వుతూ ఇంటికి వెళ్లడం చూస్తే మా బృందమంతా ఎంతో ఆనందించింది. ఇక భవిష్యత్తులో ఆమెకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో కోలుకోవడానికి ఈ చికిత్స ఎంతగానో ఉపయోగపడుతుంది" అని వివరించారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

- కాంగ్రెస్‌లో చేరిన రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి
- రాజకీయాల్లో యువత రాణించినప్పుడే రాష్ట్ర పురోగతి : సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ - కూకట్ పల్లి

సమాజ శ్రేయస్సు కోసం యువత ముందుకు రావాలని, రాజకీయాల్లో యువత రాణించినప్పుడే రాష్ట్ర పురోగతి లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ డివిజన్ కు చెందిన యువనేత రామకృష్ణ గౌడ్ గురువారం కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువనేత రామకష్ణ గౌడ్‌కు పార్టీ కండువా వేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కషి చేస్తూనే ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ యువతకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి రంజిత్ రెడ్డి విజయం కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఆల్విన్ కాలని డివిజన్ గౌరవాధ్యక్షులు అనిల్ రెడ్డి..

రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సమక్షంలో, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆల్విన్ కాలని డివిజన్ గౌరవాధ్యక్షులు అనిల్ రెడ్డి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు స్వయంగా సీఎం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆల్విన్ కాలని డివిజన్ గౌరవాధ్యక్షులు అనిల్ రెడ్డి. ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ఆరు గ్యారంటిల పథకాల అమలులో అన్ని వర్గాల ప్రజలకు చేరువ వుతూ, సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజా పాలన సాగిస్తున్నందున, ప్రజా పాలనలో తాను సైతం భాగస్వామ్యం కావాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ విధానాలు నచ్చాయి కాబట్టి కాంగ్రెస్‌లో చేరానని,పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని అనిల్ రెడ్డి తెలిపారు.



6 న రాజధాని పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కూకట్‌పల్లి డివిజన్ జగద్గిరిగుట్ట సమీపంలోని పాపిరెడ్డినగర్ లో గల రాజధాని పాఠశాల వార్షికోత్సవ వేడుకలు"ప్రేరణ మహోత్సవ్ 2కే 2 ఫోర్" పాపారాయుడు నగర్‌లోని అశోక గార్డెన్స్‌లో ఈనెల 6న శనివారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్టు పాఠశాల చైర్మెన్,కరస్పాండెంట్ యాద నరేంద్ర గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జబర్దస్త్ ఫేమ్ కమెడియన్ రాజమౌళి, సోషల్ మీడియా (ఎస్.ఎస్. కపుల్స్ ఇన్ ఫ్లుయెన్సర్స్) సంధ్యశ్రీకాంత్ దంపతులు హాజరవుతారని చెప్పారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.



కష్టపడి పని చేద్దాం... మల్కాజిగిరిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దాం.

- కారు గుర్తుపై గెలిచి పార్టీ మారిన నాయకులను విడిచిపెట్టే ప్రసక్తే లేదు
- ఎవరూ అధైర్య పడవద్దు... మీ వెంట నేను ఉంటా
- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద

నవతెలంగాణ-దుండిగల్

కష్టపడి పని చేసి.. మల్కాజిగిరిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దామని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని బుధవారం రాత్రి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హిల్ కౌంటీ నందు బీఆర్ఎస్ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షులు రంగ రాయ ప్రసాద్ అధ్వర్యంలో కార్పొరేషన్ లోని ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన పార్లమెంట్ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఎంపీ అభ్యర్థి కూడ బీఆర్ఎస్ ఉంటే అభివృద్ధి రెట్టింపు అవుతుందని ప్రజలకు వివరించాలన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నీటి సమస్యను తీర్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని చెప్పారు. మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులకు స్థానిక సమస్యలపై కనీస అవగాహన లేదని, గతంలో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. కొత్తగా ఎన్నికల్లో పోటీ చేసే బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు చేసేదేమీ లేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రణాళిక బద్ధంగా ఇంటింటికి తిరుగుతూ ముమ్మరంగా ప్రచారం చేసి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించే విధంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా కారు గుర్తుపై గెలిచి ఇతర పార్టీలోకి మారిన ప్రజా ప్రతినిధులను విడిచి పెట్టే ప్రసక్తే లేదన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కో- ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట మేయర్ పై కాంగ్రెస్ నాయకుల నుంచి ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ అభిమాన నాయకుడు కోలనుశ్రీనివాస్ రెడ్డి పై మేయర్ భర్త అనుచిత ఆరోపణలు చేశాడంటూ నిరసన వ్యక్తం చేస్తూ మేయర్ భర్త దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీపై అవాకులు చేవాకులు మాట్లాడి అవహేళన చేసిన భూ ఆక్రమణదారుడిని పార్టీలోకి ఆహ్వానించడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తల అభిమానుల మనోభావాలతో పని లేకుండా పార్టీలోకి రాకముందే మళ్లీ ఇక్కడ ఆధిపత్యం కోసం మీడియా సమావేశంలో తమ అభిమాన నాయకుని పై ఆరోపణలు చేశాడన్నారు. ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని, కష్టపడి పార్టీ కోసం పనిచేసే వారికే గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవతెలంగాణ-దుండిగల్

సర్ సి.వి. రామన్ యంగ్ జీనియస్ అవార్డులు ప్రదానం



నవతెలంగాన-సిటీబ్యూరో

సూచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో సర్ సి.వి రామన్ యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఆస్కార్ అవార్డు గ్రహీత, టాలీవుడ్ గీత రచయిత గాయకుడు చంద్రబోస్, రక్షణ మంత్రికి మాజీ సైంటిఫిక్ అడ్వైజర్, సెక్రటరీ డిడి (ఆర్ అండ్ డి) అండ్ చైర్మెన్ డిఆర్ డిఓ అండ్, హెచ్ ఈ డా.జి. సతీష్ రెడ్డి, భారతదేశానికి రిపబ్లిక్ ఆఫ్ బల్గేరియా గౌరవనీయమైన అంబాసిడర్ నికోలాయ్ హ్రిస్టోవ్ యాంకోవ్ పాల్గొని అవార్డులు అందజేశారు ప్రముఖ సామాజిక సేవా సంస్థ సుచిరిండియా ఫౌండేషన్ 31వ సర్ సివి రామన్ టాలెంట్ సెర్చ్ పరీక్షను జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ పాఠశాలల్లో నిర్వహించింది. 1500 పాఠశాలల నుండి లక్ష మంది విద్యార్థులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా, తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన 31వ జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో 16 మందికి గోల్డ్ మెడల్స్, 16 మంది ర్యాంకర్స్‌కు, 396 డిస్ట్రిక్ ర్యాంకేర్స్ కి, 8 మందికి చిత్రాలయా పురస్కార్ అవార్డ్స్, 8 మందికి గురు బ్రహ్మ అవార్డ్స్, రాష్ట్రా స్థాయి మెడల్స్, జిల్లా స్థాయి ర్యాంక్స్ వచ్చిన యువ టాలెంట్ విద్యార్థులకు శ్రీ సత్యసాయి నిగమాగమంలో అవార్డులు ప్రదానం చేసినట్టు సూచిరిం డియా ఫౌండేషన్ నిర్వహకులు లయన్ కిరణ్ తెలిపారు. తనకు 30 ఏండ్లుగా ఈ అవార్డ్స్ అందచేయడం చాలా సంతోషంగా ఉందని, తనకు స్ఫూర్తి అబ్దుల్ కలా మ్ అని, మనం దేశానికి ఏదో ఒక విధంగా సేవ చేయాలన్నారు

గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ వైస్ చైర్మెన్‌గా నిజాముద్దీన్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం వైస్ చైర్మెన్ గా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ మైనారిటీ నాయకులు ఎండి.నిజాముద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు గ్రేటర్ కాంగ్రెస్ మైనారిటీ చైర్మెన్ అర్షద్ షేక్ సాహెబ్ చేతుల మీదుగా నియామక పత్రం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని, మైనార్టీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కషి ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు చేయలేదన్నారు. గత ప్రభుత్వాలు వారి స్వలాభాలకు మైనార్టీలను ఉపయోగించుకున్నారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుందని ఆయన పునరుద్ఘాటించారు. గ్రేటర్ కాంగ్రెస్ మైనారిటీ వైస్ చైర్మెన్ గా నియమితులైన ఎండి.నిజాముద్దీన్ మాట్లాడుతూ గత రెండున్నర దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసినందుకు తన సేవలను గుర్తించి ఈ పదవి బాధ్యతలను అప్పజెప్పారన్నారు.తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ శ్రేణులను కలుపుకొని పోతూ పార్టీ శ్రేయస్సు కోసం అంకితభావంతో సైనికుడిలా పని చేస్తానని స్పష్టం చేశారు.రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలను సన్నద్ధం చేయనున్నట్టు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తోపాటు జాతీయ మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు ఇమ్రాన్ ప్రతాప్ గర్హి,రాష్ట్ర మైనారిటీ ఇన్చార్జ్ ఫర్హాన్ ఆజ్మీ లతోపాటు తనకు ఈ పదవి రావడానికి సహకరించిన అధినాయకులకు,కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేస్తా

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మండువేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు తన వంతు చేయూతగా పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం గాజుల రామారం డివిజన్ పరిధి శ్రీరామ్ నగర్(ఏ) చౌరస్తాలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకీ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు ఎక్కువగా నీరుతాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ యువ నాయకులు దండే రాజు,హర్భజన్ సింగ్, రాజారెడ్డి, మహమ్మద్ అన్వర్,సంజయ్ కుమార్,తిరుపతి యాదవ్, నర్సింగ్ రావు,అమర్నాథ్,మహేందర్, ప్రకాష్,గడ్డం వెంకటేష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కుమార్ యాదవ్




నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన కుమార్ యాదవ్‌ను రాష్ట్ర పార్టీ నియమించింది. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా నియమితులైన కుమార్ యాదవ్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ కూడా కుమార్ యాదవ్‌కు అభినందనలు తెలిపి పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని తెలిపారని కుమార్ యాదవ్ అన్నారు. అలాగే రాష్ట్ర కమిటీలో అవకాశం దొరికినందుకు సంతోషమని.. ఇచ్చిన బాధ్యతను గొప్ప అవకాశంగా భావించి పార్టీ పటిష్టత కోసం రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని కుమార్ యాదవ్ అన్నారు. అలాగే అందరి సహకారంతో ముందుకు సాగడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు.

ఈటల రాజేందర్‌ను గెలిపించాలి

- బీజేపీ మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి బొల్లెపల్లి సీతారామరాజు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను మల్కాజిగిరి ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీజేపీ మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి బొల్లెపల్లి సీతారామరాజు బీజేపీ శ్రేణులను కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ దేశానికి ప్రధాన మంత్రి హోదాలో మోడీ తెచ్చిన సంస్కరణలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలబడి పోతాయన్నారు. మరొకసారి మోడీకి అవకాశం ఇస్తే భారతదేశం ప్రపంచంలోనే అగ్రదేశంగా నిలపగల సమర్థుడని పునరుద్ఘాటించారు. మల్కాజిగిరి ప్రజలు చైతన్యంతో ఆలోచించి ఈటల రాజేందర్‌కు ఓటు వేయాలని కోరారు.గతంలో రేవంత్ రెడ్డి మల్కాజిగిరి ఎంపీ గెలిచి ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నాయకత్వంలో ఈటల ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

తుక్కుగూడ బహిరంగ సభకు భారీగా తరలిరండి

- కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఈ నెల 6న జరగనున్న తుక్కుగూడ ప్రాంతంలో రాష్ట్ర కాంగ్రెస్ తలపెట్టిన "జన జాతర" బహిరంగ సభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలను హనుమంత్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ మేరకు గురువారం గాజులరామారం డివిజన్ పరిధిలో విన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిని పట్నం సునీత మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ అధిష్టానానికి బహుమతి అందజేద్దామని సూచించారు. ఈ జన జాతర సభకు అగ్రనేతలు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ,రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ విచ్చేసి ఎన్నికల మ్యానిఫెస్టోని విడుదల చేయనున్నారని వివరించారు. నియోజకవర్గంలోని ప్రతీ డివిజన్, మున్సిపాలిటీ,కార్పొరేషన్ల నుండి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతి రెడ్డి, సొంటిరెడ్డి పున్నారెడ్డి,ఏ బ్లాక్ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్,బండి శ్యామ్ గౌడ్,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి,కాంగ్రెస్ సేవాదళ్,వివిధ డివిజన్ల కాంగ్రెస్ శ్రేణులు, మైనారిటీ విభాగం,మహిళా విభాగం,యువజన విభాగం, ఎన్.ఎస్.యు.విభాగం, ఐ.ఎన్.టి.యు.సి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎస్ సెట్ సభ్య కార్యదర్శిగా ప్రొ.జి.నరేష్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీఎస్ సెట్) సభ్య కార్యదర్శిగా ఓయూ కామర్స్ కళశాల వాణిజ్య శాఖ ప్రొ. జీ. నరేష్‌రెడ్డి నియమిస్తు ఓయూ వీసీ ప్రో.రవీందర్ నియామక పత్రాన్ని అందజేశారు. ప్రొఫెసర్ జి. నరేష్‌రెడ్డి ఇప్పటి వరకు టీఎస్‌సెట్ సమన్వయకర్తగా పనిచేశారు. ప్రస్తుతం అయిన ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న పద్మారావు

నవతెలంగాణ-ఓయూ



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ నియోజవర్గంలోని సీతాఫల్ మండి డివిజన్ వారసి గూడ లోని షాబాద్‌గూడ కౌసల్ నాన్ మహల్ ప్రాంతంలో మైనా రిటీ నాయకులు మహమ్మద్ లైక్ (ఏర్పాటు చే సిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ బి.ఆర్.ఎస్ పార్టీ ఎం.పి అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ హేమ, యువజన విభాగం రాష్ట్ర నాయకుడు రామేశ్వర్ గౌడ్ , మైనారిటీ నాయకులు కరీం , పాషా ఖాద్రి , ఖదీర్ , గౌస్ , జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంటర్ కాలేజ్ కల్చరల్ పోటీలు

- పెయింటింగ్ పోటీల్లో పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు
- జోష్‌ని నింపిన నృత్య పోటీలు..26న బహుమతుల ప్రదానం
- డీన్ ప్రొ.రాజేంద్ర నాయక్



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో ఉస్మాని విశ్వవిద్యాలయం ఆఫీస్‌ఆఫ్ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ వారి ఆధ్వ ర్యంలో రెండవ రోజుల పాటు నిర్వ హించిన ఉస్మాని విశ్వవిద్యాలయం ఓయూ ఇంటర్ కాలేజేట్ కల్చరల్ కాంపిటీషన్స్ 2023-24 పోటీలు గురువారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. డీన్ స్టూడెంట్ అఫైర్స్, కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ బి.రాజేందర్‌నాయక్ మాట్లాడుతూ పోటీల్లో విద్యార్థులు జోరుగా హుషారుగా ఉల్లాసంగా ఉత్సహంగా పాల్గొన్నారు. ఓయూ క్యాంపస్, కాన్స్టెంట్ , అఫ్లియేషన్ కళాశాలాలకు సంబంధించిన యూజీ, పీజీ అభ్యసిస్తున్న 1158 మంది విద్యార్థిని, విద్యార్థులు 168 కళాశాలాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని ప్రొ.బి.రాజేందర్ నాయక్ చెప్పారు. విజేతలకు 26న, ఓయూలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజే స్తామన్నారు. సీనియర్ ప్రొఫెసర్ మాజీ హెడ్ ప్రొఫెసర్ డి.సూర్య ధనుంజయ్, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రొఫెసర్ కె.కృష్ణచైతన్య, ఆఫీస్ ఉద్యోగులు సూరజ్, మధు , ప్రేమ్ కుమార్ అధ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏవీస్ ఆస్పత్రి 23వ నూతన శాఖ ప్రారంభం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎవీస్ ఆస్పత్రిలో కొత్తశాఖలతో సేవల విస్తరణలో భాగంగా 23వ శాఖను నూతనంగా ప్రారంభించినట్లు నిర్వా హకులు తెలిపారు. వాస్క్యులర్ రంగంలో భారతదేశంలోనే అగ్రగామిగా నిలిచిన ఎవీస్ ఆస్పత్రి తమ సేవలను మరింత విస్తరించిందని, దీనిలో భాగంగా గురువారం కూకట్ పల్లిలో ఎవీస్ హాస్పిటల్స్ నూతన శాఖ ప్రారంభ మైందని ఆసుపత్రి ఎండీ , ప్రముఖ ఇంటర్వెన్షనల్ రేడియోలజిస్ట్ డాక్టర్ రాజా.వి.కొప్పాల కొత్త ఆసుపత్రి సేవలకు అంకురార్పణ చేశారని ఈ సందర్భంగా తెలిపారు. డాక్టర్ రాజా మాట్లాడుతూ కూకట్ పల్లి శాఖ ప్రారంభంతో తమ ఆసుపత్రి శాఖలు 23కు చేరాయని, త్వరలో మరిన్ని శాఖల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఇక్కడ కూడా నిరంతర సేవలు అందుతాయన్నారు. వేరికోస్ వెయిన్స్ విభాగంలో మరిన్ని ఆధునిక విధానాలను అందుబాటులోకి తెస్తున్నామని, అంతేగాక నూతనంగా క్లాక్స్ అనే చికిత్సతో వేరికోస్ వెయిన్స్‌ను పూర్తిగా తొలగించే ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఇప్పటికే తమ అన్ని శాఖలలోనూ సుమారు 3500 రూపాయిల విలువైన కలర్ డాప్లర్ టెస్ట్‌ను ఉచితంగా చేస్తున్నామన్నారు.ప్రధాన ఆసుపత్రిలో సేవలు యధావిధిగా అందుతాయని తెలిపారు. నూతన కార్యాలయ ప్రాంగణాన్ని ఆసుపత్రి డైరెక్టర్ సురేఖ రాజా ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఆసుపత్రి డైరెక్టర్లు టి. శ్రీనివాస్, భరత్, వైభవ్ , డాక్టర్ సంపత్ , డాక్టర్ మల్లీశ్వరి , డాక్టర్ బిందు, ఆసుపత్రి అధికా రులు సుదీప్త, రాఘవన్, రవికిరణ్, కుమార్, , హర్ష, నాగేశ్వరరావు, బడే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'స్విమ్మింగ్‌పూల్‌ను అందుబాటులోకి తేవాలి'




నవతెలంగాణ-ఓయూ

స్విమ్మింగ్ పూల్‌ను ఓపెన్ చెయ్యకుండా, మరమ్మతులు చేపట్ట కుండా పబ్బం గడుపుతున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రాజేష్ కుమార్‌ని గురువారం ఏబీవీపీ విద్యార్థులు నిలదీశారు. వెంటనే రాజీనామా చెయ్యాలి లేదంటే వెంటనే రేపు స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించలన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్‌కు మరమ్మతులు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థి నాయకులు అలివేలి రాజు,ధృహాన్, శివ, కోఠి జైవీర్,నవీన్,శ్రీకాంత్, శివ, మహేష్, శ్రీకాంత్,అనిల్, పాల్గొన్నారు.

15 రోజుల్లో ప్రారంభం: స్విమ్మింగ్ పూల్‌కు సంబంధించిన పనులు దానికి చేయించాల్సిన మరమ్మతుల పనులపై ఓయూవీసీతో సాయంత్రం ఓయూ ఏబీవీపీ విద్యార్థులు భేటీ ఐయ్యారు. స్పందించిన ఓయూ వీసీ ప్రొ.రవీందర్‌యాదవ్ నేటి నుండి స్విమ్మింగ్ పూల్ మరమ్మతు పనులు చేపట్టి 15 రోజుల్లో స్విమ్మింగ్ ఫుల్‌ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు హామీ ఇచ్చారని విద్యార్థులు పేర్కొ న్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ డైరెక్టర్ రాజేష్ కుమార్, ఏబీవీపీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూ మాజీ రిజిస్ట్రార్ మృతి.. పలువురు నివాళులు

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్టర్, మైక్రోబయాలజీ ఫౌండర్ హెడ్ ప్రొ.హన్మంలు పొలాస గురు వారం మధ్యాహ్నం హైదరాబాద్ హబ్సిగూడాలో తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. అనంతరం అయిన అంత్యక్రియలు గురువారం సాయంత్రం జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో సాయంత్రం కుటుంబ భ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అయిన 1974సంలో ఓయూలో మైక్రో బయాలజీ విభాగాన్ని స్థాపించి విభాగ అభివృద్ధికి విశేష సేవాలు అందజేశారు. ఇక రిజిస్టర్‌గా ఓయూ అభివృద్ధికి తోడ్పాటు ఇచ్చారు. అయిన మృతి ఓయూ అధికారులు నిజం కళశాల ప్రిన్సిపాల్ ప్రొ.బీమా,హెచ్‌సీడీసీ డెరైక్టర్ డా.సందీప్త బూర్గుల, అయిన పరిశోధన విద్యార్థులు ఆయనకు సంతాపం వ్యక్తం చేశారు.

వెంకట్ గరిక పాటి సేవ విశిష్టం : ప్రకాష్ చంద్రబారర్

నవతెలంగాణ-కల్చరల్



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్నత పదవీ భాధ్యతలు నిర్వర్తిస్తూ కూడా అధ్యాత్మిక సాహితీ సేద్యం చేస్తున్న వెంకట్ గరికపాటి సేవ విశిష్టమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ ప్రకాష్ చంద్రబారర్ అభినం దించారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై శ్రీ రామ సాం స్కృతిక సేవా సంస్థ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వెంకట్ గరికపాటి ఇరవై వ రచన చిన్న తిరుమలయ్య సంకీర్తనల పై వ్యాఖ్యాన సహిత చిన్మయ చింతనం సంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రకాష్ చంద్ర పాల్గొని సంపుటిని అవిష్కరించి మాట్లాడారు. అన్నమాచార్యులు సంకీర్తనల పై వెంకట్ గతంలో మెచ్చ తగ్గ వ్యాఖ్యానం చేసి ప్రశంసలు పొందారని గుర్తు చేశారు సంకీర్తనల భాషా సంపద ను ముందు తరాలకు వెంకట్ తన వంతుగా అందిస్తున్నారని ప్రశంసించారు. వెంకట్ సంస్కార వంతుడు నిబద్ధత కల వారని అన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త సుధామ మాట్లడుతూ చిన్న తిరుమలయ్య వాగ్గేయకారులు అన్నమయ్య మనుమడు అని తాత వారసత్వంగా అయన సంకీర్తనలు రచన చేశారని వివరి ంచారు. వారి హృదయాన్ని ఆవిష్కరించే విధంగా వెంకట్ వ్యాఖ్యానం చేస్తున్నారని కొనియాడారు. వేదికపై జోసఫ్, ఉమా వెంకట్, మమత ప్రకాష్ బరార్ గరికపాటి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం తొలుత నూట ఎనిమిది మంది శిష్య బృందంతో గురువు శ్రీనిధి తిరుమల సప్తగిరి సంకీర్తన పేరిట అన్నమయ్య కీర్తనలు మధురం గా గానం చేసి శ్రోతలను ముగ్ధులను చేశారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

- రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత ఎన్నికల సంఘం గుర్తించిన అత్యవసర సర్వీస్ శాఖల సంబంధించిన ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురుశెట్టి అన్నారు. అత్యవసర సర్వీస్ శాఖ నోడల్ అధికారులతో పోస్టల్ బ్యాలెట్ పై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర సర్వీస్ శాఖలకు సంబంధించిన శాఖకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఒక నోడల్ అధికారి నియమించి వివరాలను అందజేయాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేవారు ఫారం-12డీ పూర్తిగా నింపి దానితో పాటు ఓటరు గుర్తింపు కార్డు జత చేస్తూ సంబంధిత హెడ్ ఆఫీసర్ అటెస్టెడ్ చేసి రిటర్నింగ్ అధికారి వద్ద ఈ ఏప్రిల్ 15 తేదీలోగా అందజేయాలని కోరారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తారని, అర్హత ఉన్న వారికే ఓటు వేసే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఎపిక్ కార్డు ఉంటే సరిపోదు, ఓటర్ జాబితాలో పేరుందో లేదో పరిశీలన చేసుకోవాలని.. ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా మీ ఎపిక్ నంబర్‌తో పరిశీలన చేసుకోవచ్చునని అన్నారు. ఒక సారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు నిర్ణయించిన పిదప పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తానని అనుకుంటే కుదరదని, ఓటరు జాబితాలో మార్కు వేసి నందున పిఠ ఓటు వేయడానికి అవకాశం ఇవ్వరని అన్నారు. ఓటు ఏ నియోజకవర్గంలో ఉందోఅక్కడ పోలింగ్ రోజున వేసేందుకు ప్రభుత్వ ఉద్యోగికి ప్రత్యేక సీఎల్ అనుమతి ఇస్తూ కేంద్ర ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించినట్టు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు ఇదివరకే ఎన్నికల విధులు నిర్వహించిన వారికి ఫారం-12డీ ఇవ్వవలసిన అవసరం లేదన్నారు. ఇప్పటికే ట్రైనింగ్ తరగతుల సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకు నేందుకు ఫారం-12 అందజేయడం జరిగిందన్నారు. పార్ల మెంట్ ఎన్నికల కోసంతో పాటు కంటో న్మెంట్ అసెంబ్లీ ఎన్నికలకు కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చునన్నారు. పోస్టల్ బ్యాలెట్ అందజేసిన వారికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు మే3 నుండి 8 వరకు ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద అవకాశం ఉందని, నిర్ణయించిన తేదీలలో కాకుండా 8 తర్వాత పోస్టల్ బ్యాలెట్ వేస్తానని రిటర్నింగ్ అధికారి వద్దకు వస్తే సంబంధిత హెడ్ బాధ్యుడిని చేసి సం బంధిత అధికారి చర్యలకు వెనుకాడమన్నారు. హైదరాబాద్, సికింద్రా బాద్ పార్లమెంట్ పరిధిలో అత్యవసర సేవల ఉద్యగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ జాయింట్ సీఇఓ ఆకాష్, డీఆర్ ఓ వెంకట చారి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధి కారి డిప్యూటీ కలెక్టర్ అర్చన, అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్) మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనాల పాలన వద్దు



- రాష్ట్రీయ మానవ్ పార్టీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రస్తుతం దేశంలో రాజకీయాలు వ్యాపారమైన తరుణంలో సేవా దృక్పథంతో పాలన అందించడమే లక్ష్యంగా తమ పార్టీని స్థాపించినట్లు రాష్ట్రీయ మానవ్ పార్టీ (ఆర్ ఎంపీ) జాతీయ అధ్యక్షుడు ఎం.యోగేష్ శెట్టి అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ విలేకర్ల సమావేశం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక చేసిన సత్యానంద డేవిడ్ పాల్‌కు నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో విద్యా, వైద్యంతో పాటు రాజకీయాలు వ్యాపారంగా మారాయని, సామాజిక స్పృహ కలిగి దేశానికి సేవ చేసే ఉన్నత లక్ష్యం కలిగిన పేదవారు రాజకీయాల్లోకి రాలేని దుస్థితిని ప్రస్తుత పార్టీలు తీసుకువచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ప్రాంతాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతున్న విధానాన్ని ప్రజలు గమనిస్తున్నార న్నారు. ఈ నేపథ్యంలోనే ఇలాంటి స్వార్థ ప్రయోజనాలను ఆశించకుండా ప్రజాసేవ కోసం ముం దుకు వచ్చే వారిని ప్రోత్సహించే లక్ష్యంతో పార్టీని స్థాపించామన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో దేశవ్యాప్తంగా 130కి పైగా స్థానాల నుంచి పోటీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నూతన ఉపాధ్యక్షురాలు కె వి గీతా కుమారి, ప్రధాన కార్యదర్శి బెజవాడ రవి కుమార్, కనకం రమేష్,కనకం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత వైపు ప్రతీ ఒక్కరు అడుగులు వెయ్యాలి



- చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- జీహెచ్ఎంసీ సిబ్బంది

నవతెలంగాణ-ముషీరాబాద్

తమ చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛత వైపు ప్రతి ఒక్క రు అడుగులు వేయాలని ముషీ రాబాద్ సర్కిల్ 15 జీహెచ్ఎంసీ అధికారులు సిబ్బంది పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గంలో రోడ్ల పైన చెత్తాచెదారం వెయొద్దని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ ఎంసీ అధికారులు సిబ్బంది మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి బస్తీలో స్వచ్ఛత పరి శుభ్రత పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కాళీ ప్రదేశాల్లో చెత్తను వేయకూడదన్నారు. తమ ఇంటి చెత్తను చెత్తను తరలించే ఆటో వాళ్లకి ఇవ్వాలని కోరారు. అది కాకుండా రోడ్ల పైన చెత్తను వేయడం వలన మన పరిసరాలు అపరిశుభ్రంగా మారి మనమే అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని తెలిపారు. రోడ్లపైన చెత్తను వేస్తే భారీ జరిమానాతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారం తెలిపారు. ప్రజలు సహకరించి పరిశుభ్రత వైపు అడు గులు వేయాలని కోరారు. ఈ కార్యక్ర మం లో జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

మార్నింగ్ వాకర్లతో సమావేశమైన సునీతరెడ్డి, శ్రీగణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కాంగ్రెస్ పార్టీ మల్కాజగిరి పార్లమెంటు అభ్యర్థి సునీతారెడ్డి కంటోన్మెంట్ సీనియర్ పార్టీ నియోజకవర్గ ఆశావాది శ్రీగణేష్ గురువారం ఉదయం మార్నింగ్ వాకర్లతో సమా వేశమయ్యారు. బోయినపల్లి, పలు పార్కులలో అలాగే ఆరో వార్డులోని పలు ప్రాంత పార్కు వాకర్లను కలిసి పలు అంశాలపై ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. శ్రీ గణేష్ ఈసారి కంటోన్మెంట్ ప్రాంతంలో ఓటర్లు రెండు ఓట్లు వేయాల్సి ఉంటుందని, ఒకటి ఎమ్మెల్యే అభ్యర్థికి రెండవది పార్లమెంట్ అభ్యర్థికి వేయాల్సి ఉంటుందని వివరించారు అయితే వాకర్లు వారి అమూల్యమైన ఓట్లు కాంగ్రెస్ పార్టీకే వేయాలని కూడా వారు కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజానీకానికి ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీ పథ కాలు అమలు చేస్తున్నారని కూడా శ్రీ గణేష్. ఈ సందర్భంగా వాకర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో బద్దం బలవంత్ రెడ్డి బ్లాక్ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి శామ్యూల్, సదానంద్ సంజీవ, శరత్ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్



ఇఫ్తార్ విందులతోనే మత సామరస్యానికి ప్రతీక అని ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాంనగర్ డివిజన్ దయారామార్కెట్ బంధన్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ విభాగం మాజీ అధ్యక్షుడు వాహీద్ అలీ ఆధ్వ ర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. బంధన్ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు రహీమ్ ఖాన్, సలీమ్ అండ్ సన్స్ స్నాక్స్ అందచేశారు. గురువారం ఇఫ్తార్ విందు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పండ్లను తినిపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లా డుతూ హిందు, ముస్లింలు కలిసి జరుపుకునే పండుగ రంజాన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సిరిగిరి శ్యామ్, సత్యనారాయణ, సిద్దిక్, వెం కటేష్, సమీర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుకు చర్యలు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు..!
- సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్

నవతెలంగాణ- బేగంపేట్



సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే, సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ ఆధ్వ ర్యంలో జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేసి జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివ రించారు. స్పందించిన ముఖ్యమంత్రి ఎన్నికలు ముగిసిన అనంతరం జిల్లా ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దంపతులతో కూడిన చిత్రపటాన్ని అందజేశారు. జిల్లా ఏర్పాటు విషయంలో తనవంతు మద్దతు సహాయ సహకారాలు ఉంటాయని గతంలోనే ప్రకటించి నేడు ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లిన దానం నాగేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాల్ రాజ్ యాదవ్, సభ్యులు అశోక్, కృష్ణ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, జగ్గయ్య తదితరులు ఉన్నారు.

సహారా ఆర్థిక దోపిడీ దారులను అరికట్టండి

- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు బాధితుల విజ్ఞప్తి



నవతెలంగాణ-బంజారాహిల్స్

డిపాజిటర్లకు చెల్లించాల్సిన డబ్బు చెల్లించకుండా నిషేధానికి గురైన సహారా సంస్థ ఆర్థిక దోపిడీని అరికట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సహారా బాధితులు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో బాధి తులు పూజిత, గణేష్ నర్సింగ్‌లు మాట్లాడారు. సెక్యూరి టీస్ అండ్ ఎక్స్ చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) తో పాటు ఆర్థిక నియంత్రణ సంస్థలు ఎలాంటి డిపాజిట్లు స్వీకరించొద్దంటూ నిషేధం విధించిన ఇప్పటికీ సహారా పేరుతో అక్రమంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు డిపాజిటర్లకు ఏజెంట్లకు చెల్లించకుండా ఆర్థిక దోపిడీకి పాల్పడ్డ సంస్థ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్న అనుమానాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో వీరి ఆగడాలు పెట్రేగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత నాలుగేండ్లుగా న్యాయపోరాటం చేస్తుండగా సౌత్ జోన్ డైరెక్టర్ రావిపాటి రామకోటేశ్వరావును నగరసీపీ శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవతో బుధవారం అరెస్టు చేశారని తెలిపారు. ఈ అరెస్టు బాధితులకు సంతోషం కలిగించిందని భవిష్యత్తులో పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్న ఆశ చిగురించిందన్నారు. ఓవైపు సౌత్ జోన్ డైరెక్టర్ అరెస్టు జరుగుతున్న సమయంలోనే ఉప్పల్‌కు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి నుంచి రెండు కోట్ల రూపాయల డిపాజిట్‌ను స్వీకరిం చారన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న బాధల కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రత్యేక బాధితుల సంఘాన్ని ఏర్పాటు చేసి న్యాయపోరాటం చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే ఢిల్లీలోని థీస్ హజారే న్యాయస్థానంలో 127 మంది బాధితులు కేసులు వేశారని, తెలుగు రాష్ట్రాలలో డిపాజిట్లు స్వీకరించకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా రాష్ట్రాల్లోని ఆ సంస్థకు చెందిన కార్యాలయాలను సీజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సహారా సంస్థకు చెందిన ఆస్తులను గుర్తించి విక్రయాలు జరగకుండా కాపాడాలని కోరారు.

హరిప్రసాద్ సేవల్లో దక్షిణాసియావృద్ధి సాధ్యం

- మేనేజింగ్ డైరెక్టర్‌గా వరుణ్‌ఖన్నా



నవతెలంగాణ-బంజారాహిల్స్

భారతదేశంలో అతిపెద్ద కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ ప్రదాత క్వాలిటీ కేర్ మార్క్యూ గ్లోబల్ ఇన్వెస్టర్లు బ్లాక్‌స్టోన్, టీపీజీ మద్దతుతో దక్షిణాసియాలో వృద్ధే లక్ష్యంగా క్వాలిటీ కేర్ గ్రూప్ చైర్మెన్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ హరి ప్రసాద్‌ను మేనేజింగ్ డైరెక్టర్‌గా వరుణ్ ఖన్నాను నియమించినట్లు నిర్వాహ కులు తెలిపారు. వరుణ్‌ఖన్నా మాట్లాడుతూ డాక్టర్ హరి ప్రసాద్‌కు ముప్పై సంవత్సరాల అనుభవంతో పాటు అపోలో గ్రూప్ ఆస్పత్రిలో ప్రెసిడెంట్‌గా ఉన్నారన్నారు. అపోలో ఆస్పత్రిలో 1,200 పడకల నుంచి 10 వేల పడకల స్థాయికి ఎదగ డంలో ఆయ న కీలక పాత్ర పోషించారన్నారు. సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఛైర్మెన్‌గా కూడా పని చేస్తున్నా రని గుర్తు చేశారు. రాయల్ కాలేజ్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడి సిన్, యూకే, ఇంటర్నేషనల్ ఫెడరే షన్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఆయనను ఫెలోషిప్‌తో సత్కరించిందని, ఆస్ట్రేలియాలోని మాక్వేరీ విశ్వవిద్యాలయం గ్లోబల్ ఎండీ ప్రోగ్రామ్‌కు క్యాంపస్ డీన్‌గా, ఆసి యాలో మొ ట్టమొదటి ఆరోగ్య నగరమైన హైదరాబా ద్‌లో అపోలో హెల్త్ సిటీని స్థాపించడంలో ఆయన సాయం ,వైద్య నైపుణ్యాన్ని, తిరుగులేని దృష్టిని, వైద్య విజ్ఞాన రంగంలో నేర్చుకున్న విషయాలను సంస్థకు తీసు కురా వడంలో ఆయన కృషి ఉందన్నారు. హెల్త్‌కేర్ రంగంలో పద్నా లుగు సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న తనకు క్వాలిటీ కేర్‌లోని మూడు ఆస్పత్రుల్లో సుమారు 4500 పడకల ఆస్పత్రి మేనేజింగ్ డైరె క్టర్ బాధ్యతలు ఇవ్వడం తన వృత్తికి గుర్తింపు బాధ్యతగా స్వీకరిస్తున్నానని తెలిపారు.

బాండు నగదు వెంటనే ఇవ్వాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్‌డబ్ల్యు యూ (ఐఎన్‌టీయూసీ) సెక్రటరీ జనరల్ హన్మంతు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎండీని కలిసి ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా బాండ్ డబ్బులు డ్రైవర్స్‌కి ఇచ్చారని, మిగతా ఉద్యోగులకు అందరికీ వెంటనే బాండు డబ్బులు ఇవ్వాలని కోరగా రెండు మూడు రోజుల్లో అ డబ్బులు ఇస్తామని తెలియజేసినట్లు తెలిపారు. 2013 సంబంధించిన బాండ్ డబ్బులు సిక్‌లో ఉన్నవారికి ఇవ్వడం లేదని, ఆర్థికంగా చానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి కూడా అ బాండు డబ్బులు ఇవ్వాలని ఎండీకి విజ్ఞప్తి చేయగా సిక్‌లో ఉన్న వారికి కూడా బాండు డబ్బులు ఇవ్వడానికి అంగీ కరిం చారన్నారు. అలాగే డ్యూటీలో మహాలక్ష్మి టికెట్ల విషయంలో కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎండీకు విన్నవి ంచగా సానుకూలంగా స్పందించారన్నారు. అనంతరం ఈడీ ఏ కృష్ణకాంత్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ పెసిడెంట్ సయ్యద్ మహమ్మద్,వైస్ చైర్మెన్ అండ్ ముఖ్య కార్య నిర్వాహకులు జక్కుల మల్లేశ్ గౌడ్,సీవీపీ బెన్ సుశీల్ పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి





నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు అందరూ సహకరించాలని 09 హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మం దిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్ఓ లతో నిర్వహించిన సమావేశంలో అయన పాల్గొన్నారు. ఈ అయన మా ట్లాడుతూ ఏప్రిల్ 18 నుండి 25 వరకు కలెక్టరేట్లోని తన చాంబర్‌లో హైదరాబాద్ లోకసభ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను తాను స్వీకరించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ నియోజక వర్గంలో 1944 పోలింగ్ కేంద్రాలు, 22, 06,654 (1120936 మంది పురుష ఓటర్లు 1085531మంది మహిళా ఓటర్లు,202 థర్డ్ జెండర్) ఓటర్లు ఉన్నారని తెలిపారు. హకీంపేట్‌లోని ఎంబసీ హైస్కూల్ లో ఉన్న పోలింగ్ స్టేషన్ నెంబర్ 218 ని టోలిచౌకి కేయేస్ హైస్కూల్ లోకి, హకీంపేట్ ఎంబోసి పాఠశాలలోని 219 పోలింగ్ స్టేషన్‌ను టోలిచౌకిలోని ఎంసీహెచ్ కాలనీ మున్సిపల్ వార్డు ఆఫీస్‌కు మార్చుటకు ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున మతం, కులం, ప్రాంతం పై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం తప్పుడు ప్రచారం చేయడంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవ డం జరుగు తుందన్నారు. అడ్వర్టయిజ్‌మెంట్‌లు ప్రకటనల కోసం 48 గంటల ముందు ఎంసిఎంసి దరఖాస్తు చేసుకొని అను మ తులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఈసీఐ నిర్దేశించిన ఫార్మాట్స్‌లో తమ యొక్క క్రిమినల్ అంటిసిడెంట్స్ యొక్క వివరాలను సి1, సి2, సి3, సి4, సి5లో దినపత్రికలు, టీవీ ఛానల్ లో ప్రచురితం చే యాలన్నారు. ఎన్నికలలో అక్రమాలు జరిగితే 1950 నెం బర్ ద్వారా, సివిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు న్నారు. ఎన్నికల ప్రవ ర్తనానియామావళిని ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసు కునే అవకాశం ఉందని అన్నారు. ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా వివిధ రాజకీయ పార్టీలు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సీపీఐ పి. నాగేశ్వర్, సత్యనారాయణ, సీపీఐ(ఎం) ఎం.మీనా, బీజేపీ వి.ఎస్.భరద్వాజ, యమన్ సింగ్, కొల్లూరు పవన్ కుమార్, బీఆర్ఎస్ గగన్ యాదవ్,కాంగ్రెస్ పి రాజేష్ కుమార్, బి.సతీష్ గౌడ్, ఏఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయండి..!

- పలువురు దాతులు, సేవా సంస్థలు ముందుకు రావాలి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

మండే ఎండలో వెళ్తున్న వారి దాహార్తిని చలివేంద్రాలు తీరుస్తాయి. కానీ, ఈ ఏడాది ఏప్రిల్ మాసంలోనే ఎండలు ఎక్కువగా కొట్టడం వల్లన ప్రజలు ఉష్ణోగ్రతకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని పలువురు స్థానికులు తెలిజేశారు. మండే ఎండలు జనాన్ని పరేషాన్ చేస్తున్నాయని, ఉదయాన్నే బయటికి రావాలంటే భయపడుతున్నార న్నారు. ఆఫీస్‌కి వెళ్ళే వారు రోజూ వారి పనులు చేసుకునే వారు, కూలీలు, బస్సులు, ఆటో నడిపే వారు, లేబర్స్, ఇలా నిత్యం రోడ్డు పై రవాణా చేసేవారు ఎండలకు బయపడి బయటకు కూడా సరిగ్గా వెళ్లలేకపోతున్నట్లు తెలిపారు. ఈ ఎండలకు పలు కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని బాటసారులు కోరుతున్నారు. ప్రజలు పలు పనుల కోసం బయటకు వెళ్లినప్పుడు ఈ చలివేంద్రాలు సాయంతో దాహన్ని తీర్చుకుంటారన్నారు. కానీ ఇప్పటి వరకు అటు పాలకులు పట్టింపు లేదని ఎక్కడ చలివేంద్రాల ఏర్పాటు చేయడం లేదని విమర్శిస్తున్నారు. గోషామహల్ నియోజకవర్గంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు ప్రజలు, దాహార్తులు ఆశతో స్వచ్ఛంద సంస్థల కోసం ఎదురన్నారు. ప్రతీ ఏడాది ఏదో ఒక స్వచ్ఛంద సంస్థ వారు నియోజకవర్గంలో ని కోఠి చౌరస్తా,



అబిడ్స్ చౌరస్తా, రామ్ కోఠి చౌరస్తా,నాంపల్లి పాత కలెక్టరేట్ రోడ్, ప్రణాపూర్ గాంధీ చౌరస్తా, బేగంబజార్ చౌరస్తా, అఫ్జల్ గంజ్ లైబ్రరీ, ఆగాపురం, గాంధీభవన్ రోడ్, బషీర్బాగ్ చౌరస్తా, సిబిఎస్ బస్ స్టాప్, కోఠి , పుత్లిబౌలి చౌరస్తా, ఐఎంఏ రోడ్ తదితర ప్రాంతాల్లో ప్రజల దాహాన్ని తీర్చడానికి చలి వేంద్రాలు, మజ్జిగ ప్యాకెట్లు, ప్రతీ రోజూ పంపిణి చేసే వారన్నారు. కానీ ఈ ఏడాది ఏ ఒక్క సంస్థ వారు కుడా చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన పలువురు బాటసారులు ఇబ్బందులు పడుతున్నాట్లు తెలిపారు. గతంలో పలురకాల స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేశాయని గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు, స్పెషల్ ఆఫీసర్స్ చలి వేంద్రాలు, ఏర్పాటుకు కృషి చేయాలి అని పలువురు ప్రజలు కోరుతున్నారు.

శక్తి వనరుల సద్వినియోగం మానవాళి కర్తవ్యం..





- ఉస్మానియా విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.లక్ష్మి నారాయణ

నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రకృతిలో సహజంగా ఉన్న అనేక రకాల శక్తివ నరులను సద్వినియోగం చేసుకోవడం మానవాళి కర్తవ్య మని ఉస్మానియా విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.లక్ష్మి నారాయణ అన్నారు.కౌన్సిల్ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రి యల్ రీసెర్చ్ సంస్థ సౌజన్యంతో ప్రభుత్వ సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్సస్ ఇన్ ఎనర్జీ మెటీరియల్స్ అండ్ డివైజెస్' అనే అంశంపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనీ మాట్లా డు తూ ఆ ప్రకృతి శక్తివనరులే అన్ని వ్యవస్థలను నడిపిస్తాయ న్నారు. అందు వలన వాటిని సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సృష్టి ంచవచ్చున్నారు. వనరులను గ్రహిం చటమే కాకుండా విశి ష్టమైన శక్తి వనరులను తయారు చేసే దిశగా పరిశోధనలు సాగాలని ఆకాంక్షించారు. విద్యా ర్థులు డిగ్రీకే పరిమితం కాకుండా ఉన్నత విద్యార్జన దిశగా, పరిశోధన వైపుగా అడుగులు వేయాలని సూచిం చారు. శతవసంతాల సిటీ కళాశాల తెలంగాణ కీర్తికి సంకేతమని,ఈకళాశాలభవన నిర్మాణ శైలి అపూర్వమన్నారు. ప్రముఖ సంఘసేవ కులు నక్కా శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశాల వైపు చూడకుండా స్వదేశంలో నే చదువు కుని దేశాబివృద్ధికి పాటు పడాలని పిలుపుని చ్చారు.సభకు అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్. విప్లవ్ దత్‌శుక్లా మాట్లాడుతూ.. జాతీయ సదస్సును విజ య వంతంగా నిర్వహించిన భౌతిక శాస్త్ర విభాగాన్ని అభి నందిం చారు. సదస్సు సమన్వయ కర్త డాక్టర్.కె.పర్వ తాలు రెండు రోజుల సాంకేతిక సమావేశాల నివేదికను సమర్పించారు. ఐఐటి హైదరాబాద్ ఆచార్యులు డాక్టర్. సూర్యనారా యణ, హైదరాబాద్ సెంట్రల్ యూ నివర్సిటీ ఆచార్యులు డాక్టర్. ప్రతాప్, డాక్టర్.బషీద్, భౌతిక శాస్త్ర విభాగం అధ్యక్షులు డాక్టర్. నైన వినోదిని, సదస్సు సహా య సమన్వ యకర్త డాక్టర్. వాసుదేవరెడ్డి, డాక్టర్. చిన్ని కృష్ణ, డాక్టర్. లక్ష్మీ శ్రీనివాస్, డాక్టర్.యాదయలు పాల్గొ న్నారు. సదస్సులో పత్ర సమర్పణ చేసిన ఆచార్యులకు అతిథులు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.రెండు రోజుల జాతీ య సదస్సులో వివిధ విశ్వ విద్యా లయాల, కళాశాలల ఆచార్యులు 90 మంది పత్ర సమర్పణ చేశారు. వివిధ దేశాల శాస్త్రవేత్తలు అంత ర్జాలం ద్వారా ప్రసంగించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్లు చిత్తశుద్ధితో పని చేయాలి

- హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు ప్రతి పనిని సమర్థవంతంగా చిత్తశుద్ధితో ఎలాంటి తప్పులు లేకుండా పనిచేయాలని హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం సమావేశ మందిరంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్లు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రణాళిక బద్ధంగా ఎలాంటి తప్పులు లేకుండా ఖచ్చితమైన డేటాను నమోదు చేయాలన్నారు. ట్విట్టర్‌లో వచ్చిన ఫిర్యాదులను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సువిధ అనుమతులను ఎప్పటికప్పుడు ఇచ్చేలా ప్రో ఆక్టివ్ గా ఉండాలని అన్నారు. సోషల్ మీడియా సోషల్ మీడియాలో వచ్చే వాటిని చూడాలని, సి విజిల్ యాప్ లో వచ్చే ఫిర్యాదులు 100 నిమిషాలలో సకాలంలో డిస్పోస్ అవుతున్నాయా లేదా అని





పరిశీలించాలని, నామి నేషన్ అప్లోడ్, నామినేషన్ల ఉపసంహరణ, ఫైనల్ అభ్యర్థుల జాబితా, ఓటర్ టర్న్ అవుట్ రౌండ్ వైస్ గా రౌండ్స్, కౌంటింగ్, ఫలితాల వెల్లడి తదితర అంశాలన్నీ సమర్థవంతంగా, ప్రణాళిక బద్ధంగా, తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. గురు వారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో హాజరుకాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ రజిత, హెచ్ హెచ్ పి కుమార్ యాదవ్, ఎలక్షన్స్ తహసిల్దార్ జహురుద్దీన్, ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



చిన్న కొండ చిలువ మృతి

నవతెలంగాణ-బంజారాహిల్స్

జీహెచ్ఎంసి పరిధిలోని కేబీఆర్ పార్క్ ప్రధాన రహదారి వద్ద బీఆర్ఎస్ భవన్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై ఓ కొండచిలువ మృతి చెందింది. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ కేబీఆర్ పార్క్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో కొన్ని గంటల వరకు వారు రాకపోవడంతో ఆ పామును ఎవరో కర్రలతో కొట్టి చంపినట్టు స్థానికులు తెలిపిన సమాచారమిచ్చినట్లు తెలిపారు.

IN THE COURT OF THE IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT MAHABUBNAGAR
O.S. NO. 173 of 2023

BETWEEN :-
The DCCB Ltd.,Mahabubnagar Rep.by its Chief Exccutive Officer, ...Plaintiff
And
Dommalapati Venkatachalapathy ...Defendant

To,
Dommalapati Venkatachalapathy S/o D.Swamy Reddy,C/o Shop Nos.16 to 22,DCCB Complex,Near Navodaya Institule of Medical Seiences(Hospital),Old Bus Stand Road.Mahabubnagar-509001,
WHEREAS the Plaintiff has filed above suit against you for recovery of Money.The said suit stands posted on 18-04-2024 for your appearance,You are hereby directed to appear before the above Court on said date at 10-30 a.m. either in person or through Advocate,in default the matter will be decided on the material available on record.

//BY ORDER OF THE COURT//
Coansel for Plaintiff
K.PRATAP KUMAR
Krishna Nivas
H.No.1-4-130/A/7/B.
Kamala Nehru Colony,
Bayamma Thoga,
Mahabubnagar-509001,
Telangana State
(Mobile:9848069541)

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE CUM / BEFORE THE SPL. COURT UNDER ANDHRA PRADESH LAND GRABING (PROHIBITION) ACT 1982, AT GUNTUR
L.G.O.P. NO.488/2017

Between:
1. Naidu Satyanarayana (Died)
2. Naidu Venkata Krishna Chaitanya and others .. applicants

AND

1. Badri Venkata Reddy
2. M/s Associated Cements Compines Ltd., ... Respondents

To,
Badri Venkata Reddy, S/o. Koti Reddy, R/o. R.No.6-3-609/14/2A, Anand Nagar, Khairatabad, Hyderabad. R1.

పై నెంబరు L.G.O.P. NO.488/2017 నందు 1వ రెస్పాండెంట్ అయిన మీకు మీ యొక్క హాజరు నిమిత్తము శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీరు ది.08-05-2024 ఉదయం గం.10.30 ని.లకు స్వయముగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకోవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించెదరు.

/// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ///
కుసుకు రాజశేఖర్, న్యాయవాది,
గాంధీనగరం, విజయవాడ-520003

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు కైకలూరు, ఆంధ్రప్రదేశ్
S.O.P. NO.2/2023

Between:
1. Kosaraju Charishma Devi
2. Kosaraju Daanvi
3. Kosaraju Hanvika ...Petitioners

V/s

1. Kosaraju Mahalakshmi
2. CloudFabrix Software Inc, Rep. by its CEO, Hyderabad Branch, Telangana State. ... Respondents

To,
CloudFabrix Software Inc,
Rep. by its CEO, Hyderabad Branch, Spacion Towers, No.8, Level No.2, Vittal Rao Nagar, Madhapur, Near Westin Hotel, Hyderabad, Telangana State-500081.

2010 ప్రాంతంలో ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉద్యోగ వృద్ధి బాగా తక్కువగా ఉన్నదని ఆ నివేదిక తెలిపింది. 2000-2022 మధ్యకాలంలో దేశంలో ఉపాధి నిష్పత్తి నేపాల్ మినహా ఇతర దక్షిణాసియా దేశాల కంటే బాగా వెనుకబడిందని చెప్పింది. ఉపాధి నిష్పత్తి అంటే ఏదైనా ఒక దేశంలో పనిచేసే వయసున్న ప్రజల సంఖ్యతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిని పోల్చడం. మొత్తంమీద 2000-2023 మధ్య ఉపాధి వృద్ధి పనిచేసే వయసున్న ప్రజల సగటు వృద్ధి కంటే బాగా తక్కువగా ఉంది.

దక్షిణాసియా ప్రాంతంలో మాత్రమే గత రెండు దశాబ్దాలుగా పనిచేసే వయసున్న పురుషుల వాటా పడిపోతోందని ప్రపంచబ్యాంక్ హెచ్చరించింది. భారత్ సహ పలు దక్షిణాసియా దేశాలలో మహిళల ఉపాధి రేటు 40 శాతం కంటే తక్కువగా ఉన్నదని, ఇది ప్రపంచంలోనే అతి తక్కువ రేటని ఎత్తిచూపింది. భారత్‌లో ఆర్థికాభివృద్ధి వేగవంతంగా జరుగుతున్నప్పటికీ సరిపడినంత పని చూపించలేకపోతోందని, నిరుద్యోగం అనేది అక్కడ పెద్ద సమస్యగా తయారైందని తెలిపింది.

అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా 'భారత్‌లో ఉపాధి'పై మార్చిలో ఓ నివేదికను విడుదల చేశాయి. భారత్‌లోని మొత్తం నిరుద్యోగ జనాభాలో నిరుద్యోగ యువత 82.9 శాతం ఉన్నారని ఆ నివేదిక తెలిపింది. సెకండరీ స్థాయి విద్య లేదా ఉన్నత విద్య అభ్యసించిన యువతలో నిరుద్యోగం పెరుగుతోందని వివరించింది. భారత్‌లో 2050 నాటికి మొత్తం జనాభాలో వృద్ధుల సంఖ్య 20 శాతానికి పెరుగుతుందని ఐక్యరాజ్యసమితి గత సంవత్సరం సెప్టెంబరులో తెలియజేసింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ సమస్య పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, యువతలో నైపుణ్యాన్ని పెంచాలని, వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నిపుణులు సూచిస్తున్నారు.

'స్కిల్' కేసులో చంద్రబాబుపై ఏసీబీ చార్జిషీట్



అమరావతి: స్కిల్ డెవలప్‌మెంటు కేసులో ఎసిబి అధికారులు గురువారం విజయవాడ ఎసిబి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి కె అచ్చెన్నాయుడు, గంటా సుబ్బారావు తదితర పేర్లను ఛార్జీషీట్‌లో పొందుపరిచారు. స్కిల్ డెవలప్‌మెంటు కోసం కేటాయించిన నిధులను చంద్రబాబు పక్కదారి పట్టించేందుకు కుట్రపన్నారని ఆ ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. స్కిల్ సెంటర్ల ఏర్పాటు చేయటానికి సిమెన్స్, డిజైన్ టెక్‌లకు రూ.371 కోట్ల గ్రాంటును ఎపి ప్రభుత్వం ఇస్తున్నట్లు అచ్చెన్నాయుడు, చంద్రబాబు అవగాహన ఒప్పందానికి ఆమోదం తెలిపి, ఆ డబ్బులో ఎక్కువ సొమ్మును వీరిరువురూ స్వాహా చేశారని ఛార్జిషీట్‌లో పొందుపరిచారు. జిఒఎంఎస్ నెంబరు 4కు విరుద్ధంగా నగదును విడుదల చేయాలని చంద్రబాబు ఆదేశించారని ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఛార్జిషీట్‌కు సంబంధించిన నిర్ధారణ కాపీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు సమర్పించామని, ఈ కేసులో ఎఫ్ఐఆర్ రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు కూడా నిరాకరించిందని ఆ ఛార్జిషీట్‌లో ఎసిబి పేర్కొంది.

మంత్రి జోగి రమేష్‌కు ఇసి నోటీసు

అమరావతి : పింఛన్ల పంపిణీకి సంబంధించి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు గానూ 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలంటూ గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, వైసిపి జనరల్ సెక్రటరీ లేళ్ల అప్పిరెడ్డికి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబును జోగి రమేష్ కించపరిచేలా మాట్లాడటమే కాకుండా, చంద్రబాబు వల్లే పింఛన్లు ఆగాయంటూ ప్రచారం చేయాలంటూ వలంటీర్లకు జోగి రమేష్ చెబుతున్న వీడియోను టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపారు. దీనిపై ఫిర్యాదు కూడా చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించిన జోగి రమేష్‌ను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేయాలంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

టెన్షన్ వాతావరణంలోనే మేఘాలయ

- నిందితులను విడిచిపెట్టాలంటూ కేఎస్‌యూ ఆందోళనలు
- కొన్ని రోజుల క్రితమే సీఏఏ నిరసనల్లో ఇద్దరు హత్య
- కేఎస్‌యూకి చెందినవారే కారణమని ఇద్దరు సభ్యుల అరెస్టు

న్యూఢిల్లీ : ఈశాన్యరాష్ట్రం మేఘాలయలో ఉద్రిక్తతత నెలకొన్నది. వివాదాస్ప పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వ్యతిరేక నిరసనల్లో కొన్ని రోజుల క్రితం ఇద్దరు హత్యకు గురికావటం అక్కడ తీవ్ర అలజడికి కారణమైన విషయం విదితమే. అనంతరం అక్కడ హింసాత్మక వాతావరణం అలాగే కొనసాగుతున్నది. బంగ్లాదేశ్‌తో సరిహద్దుకు దగ్గరగా ఉన్న మేఘాలయలోని ఒక గ్రామంలో జరిగిన ఈ



ఘటనలో సుజిత్ దత్తా (35), ఎసన్ సింగ్ (24)లు మరణించారు. ఈ హత్యలను ఖాసీ స్టూడెంట్స్ యూనియన్ (కేఎస్‌యూ) సభ్యులు చేశారన్న ఆరోపణలతో ఇద్దరు నిందితులు షాన్‌బోర్లాంగ్ షాతి (26), మెసదప్బోర్ స్కెంబిల్ (26)లను పోలీసులు అరెస్టు చేశారు. వీరు కేఎస్‌యూ సభ్యులు. కాగా, కోర్టు వారికి ఏడు రోజుల పోలీసు కస్టడీని విధించింది.

నిందితులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్ వెలుపల కేఎస్‌యూ సభ్యులు గుమిగూడటంతో సోహ్రా పట్టణంలో ఉద్రిక్తత పెరిగింది. కేఎస్‌యూ సీఏఏకు వ్యతిరేకంగా నిరసన చేపట్టిన కొన్ని గంటల తర్వాతే సుజిత్, ఈసాన్ లు హత్యకు గురి కావటం పలు అనుమానాలకు తావిస్తున్నదని కేఎస్‌యూ సభ్యులు అంటున్నారు. కాగా, కేఎస్‌యూ సీఏఏను వ్యతిరేకిస్తున్నది. దానికి బదులుగా ఇన్నర్ లైన్ పర్మిట్ (ఐఎల్‌పీ)కు డిమాండ్ చేస్తున్నది.

ఇచమతి బంగ్లాదేశ్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న తూర్పు ఖాసీ హిల్స్‌లోని ఒక గ్రామం. సరిహద్దు గ్రామాలు సాంప్రదాయ "దోర్బార్ ష్నోంగ్" కింద, కొన్ని ఖాసీ హిల్స్ అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ క్రింద స్థానిక ఆచార చట్టం ప్రకారం నడుస్తుంటాయి. సీఏఏ వ్యతిరేక సమావేశానికి, హత్యలకు మధ్య ఉన్న సంబంధం, దర్యాప్తు గురించి పోలీసులు పెదవి విప్పినప్పటికీ.. హత్య ఘటనల నుంచి జాతి ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయి. ఎంతగా అంటే రెండు వైపులా సంయమనం పాటించాలని ఉప ముఖ్యమంత్రి ప్రిస్టోన్ టైన్‌సాంగ్ పిలుపునిచ్చారు.

ఉగాది, రంజాన్‌కు టెన్త్ మూల్యాంకనం కేంద్రాలకు సెలవు

- 13 వరకు కొనసాగుతుంది
- ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి వార్షిక పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈనెల తొమ్మిదిన ఉగాది, 11న రంజాన్ పండుగల సందర్భంగా మూల్యాంకనం కేంద్రాలకు రెండురోజులపాటు సెలవు ప్రకటించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షలు గతనెల 18 నుంచి ప్రారంభమై ఈనెల రెండో తేదీన ముగిసిన విషయం తెలిసిందే. బుధవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. 18 జిల్లాల్లో 19 మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. హైదరాబాద్‌లో రెండు స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలున్నాయని పేర్కొన్నారు. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో ఆ రెండు రోజులు సెలవు ప్రకటించాలంటూ పలు ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

- హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొండి
- అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో మొత్తం సీట్లతోపాటు ఏడు నుంచి పదో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో ఈనెల ఏడో తేదీన ప్రవేశ పరీక్ష జరగనుంది. అదేరోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు నుంచి పదో తరగతికి దరఖాస్తు చేసిన అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామని మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 62,983 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వారిలో ఇప్పటి వరకు 33,805 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. మిగిలిన అభ్యర్థులు "elanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా వెంటనే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

విద్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ అంధకారం

- డాక్టర్ పరికపండ్ల అశోక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బాలల విద్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు అంధకారంలో మునిగిపోతాయని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆందోళన వ్యక్తం చేశారు. యునిసెఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తార్నాకలో రాష్ట్రంలో బాలల సమస్యలపై నిర్వహించిన స్వచ్ఛంద సంస్థల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అలయెన్స్ ఫర్ చైల్డ్ రైట్స్ అధినేత దరిపల్లి బాలచంద్రం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పూర్తి కాలం పని చేసే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఎం.వీ.ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్య విషయంలో దేశంలోని రాష్ట్రాలన్నింటిలో తెలంగాణ అట్టడుగుకు దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో యునిసెఫ్ దక్షిణ భారతదేశ కో ఆర్డినేటర్ రసూల్ అహ్మద్, తెలంగాణ కో ఆర్డినేటర్ డేవిడ్‌తో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి 128 మంది ప్రతినిధులు పాల్గొని సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ తీర్మానాలను వివిధ రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లి వాటి మ్యానిఫెస్టోలో పెట్టేలా కృషి చేయనున్నట్టు బాలచంద్రం తెలిపారు.



ఐక్యరాజ్యసమితి సభ్యత్వం కోసం పాలస్తీనా అభ్యర్థన

ఐక్యరాజ్యసమితిలో పూర్తి స్థాయి సభ్యదేశంగా చేర్చుకోవాలని పాలస్తీనా అథారిటీ అధికారికంగా అభ్యర్థించింది. పాలస్తీనా 2012 నుండి ఐక్యరాజ్య సమితిలో పరిశీలక దేశం హోదాను కలిగి ఉంది. శాశ్వత సభ్యత్వం ఉంటేనే పాలస్తీనా రాజ్యానికి గుర్తింపు ఉంటుంది. అయితే దీనిని అమెరికా దన్నుతో ఇజ్రాయెల్ వ్యతిరేకిస్తుంది. "ఈ రోజు పాలస్తీనా దేశం, పాలస్తీనా నాయకత్వం సూచనల మేరకు, మా సభ్యత్వ దరఖాస్తును పునరుద్ధరించమని అభ్యర్థిస్తూ సెక్రటరీ జనరల్‌కు లేఖ పంపింది" అని ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా అథారిటీ శాశ్వత రాయబారి రియాద్ మన్సూర్ మంగళవారం ఎక్స్‌లో రాసిన ఒక పోస్ట్‌లో చెప్పాడు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌కు రాసిన ప్రత్యేక లేఖలో, అరబ్ గ్రూప్, ఇస్లామిక్ సహకార సంస్థ, నాన్-అలైన్డ్ మూవ్‌మెంట్ అన్నీ మన్సూర్ అభ్యర్థనకు మద్దతు ఇచ్చాయి.

1967లో సంభవించిన ఆరు రోజుల యుద్ధం ప్రారంభమయ్యే ముందు పాలస్తీనాగా పరిగణించబడే భూభాగంపై పాలస్తీనా దేశ సార్వభౌమాధికారాన్ని పాలస్తీనా అథారిటీ ప్రకటించింది. ఇందులో గాజా, మొత్తం వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేం ఉన్నాయి. ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు "పాలస్తీనా రాజ్యం" ఆలోచనను పదేపదే తిరస్కరించాడు. ఈ ప్రాంతాలన్నీ భాగమైన "జోర్డాన్‌కు పశ్చిమానగల యావత్



ప్రాంతం ఇజ్రాయెల్ భద్రతా నియంత్రణ కింద ఉంటుంది" అని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించాడు.

వెస్ట్ బ్యాంక్‌లోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికే పూర్తి ఇజ్రాయెలీ మిలిటరీ, పౌర నియంత్రణలో ఉన్నాయి. అయితే గాజా హమాస్ పాలనలో ఉంది. పాలస్తీనా అథారిటీ ఇజ్రాయెల్‌ను గుర్తించడం, చర్చలు జరపడం చట్టవిరుద్ధమైన చర్యగా హమాస్ భావిస్తోంది.

ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం కోసం అభ్యర్థించే దరఖాస్తులను 15 సభ్య దేశాల ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదించటానికి ముందు సెక్రటరీ జనరల్ ఆమోదించాలి. పాలస్తీనా అథారిటీ 2011 లో ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసింది. కానీ ఆ దరఖాస్తు ఎన్నడూ భద్రతా మండలి ఆమోదం కోసం వెళ్లలేదు. ఒకవేళ అటువంటి దరఖాస్తును భద్రతా మండలిలోని మెజారిటీ సభ్యదేశాలు ఆమోదిస్తే తాను తనకున్న వీటో అధికారాన్ని వినియోగిస్తానని అమెరికా ప్రకటించటం వల్లనే పాలస్తీనాకు ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం రాలేదు. మరుసటి సంవత్సరం ఐక్యరాజ్య సమితి పాలస్తీనా స్థితిని "సభ్యులు కాని పరిశీలక సంస్థ" నుండి "సభ్యులు కాని పరిశీలక దేశం"గా అప్‌గ్రేడ్ చేసింది. ఇటువంటి హోదా పాలస్తీనా, వాటికన్ సిటీలకు మాత్రమే ఉంది.

పాలస్తీనా అథారిటీ పునరుద్ధరించిన దరఖాస్తు మళ్లీ అమెరికా వీటోకు గురయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా జరిగే ఏదైనా భద్రతా మండలి నిర్ణయాన్ని వీటో చేయకుండా ఉండటానికి అమెరికా సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చింది. గత నెల చివర్లో భద్రతా మండలిలో అమెరికా ఓటింగ్‌కు దూరంగా ఉండటం వల్లనే గాజాలో తక్షణ కాల్పుల విరమణను డిమాండ్ చేస్తూ ఒక తీర్మానాన్ని భద్రతా మండలి ఆమోదించగలిగింది. ఇజ్రాయెల్‌కు తన సైనిక మద్దతును కొనసాగిస్తున్నప్పటికీ, భద్రతా మండలిలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఆమోదించబడిన తీర్మానాన్ని అమెరికా వీటో చేయకపోవటం ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మధ్య నెలకొన్న విభేదాలకు సంకేతంగా ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఐక్యరాజ్య సమితిలోని దాదాపు 140 సభ్య దేశాలు ఇప్పటికే పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించాయి.

ఉక్రెయిన్ ఫ్రంట్ లైన్ పతనం అవుతుందని

మద్దతుదారుల ఆందోళన - మీడియా

ఈ వేసవిలో ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థను రష్యా ఛేదించగలదని ఉక్రెయిన్‌లోను, దాని పాశ్చాత్య మద్దతుదారులలోను ఆందోళనలు పెరుగుతున్నాయని పాశ్చాత్య మీడియా రాస్తోంది. పాశ్చాత్య దేశాల నుండి రావలసిన ఆయుధాలు సకాలంలో రాకపోవటంవల్ల యుద్ధ క్షేత్రంలో ఉక్రెయిన్ కు భారీ నష్టం కలుగుతోంది. ప్రెసిడెంట్ వ్లాదిమిర్ జెలెన్స్కీ గత వారం వాషింగ్టన్ పోస్ట్‌తో మాట్లాడుతూ ఫ్రంట్ లైన్ పొడవును తగ్గించి, దానిని రక్షించుకునేందుకు తమకున్న పరిమిత ఆయుధాలను, సైనికుల సంఖ్యను ఉపయోగించడానికి ఉక్రెయిన్ దళాలు మరింత వెనక్కి తగ్గవలసి ఉంటుందని చెప్పాడు. "ఫ్రంట్ లైన్ విచ్ఛిన్నమైతే, రష్యన్లు ఉక్రెయిన్‌కు చెందిన పెద్ద నగరాలకు చేరుకోవచ్చు" అని ఆయన హెచ్చరించాడు.

ఉక్రెయిన్‌తో పోల్చితే రష్యా కాల్చిన ఫిరంగి షెల్స్ నిష్పత్తి సంవత్సరం ప్రారంభం నుండి 3:1 నుండి 7:1కి పెరిగిందని బ్లూమ్‌బెర్గ్ బుధవారం రిపోర్ట్ చేసింది.

పాశ్చాత్య దేశాలు దానం చేసిన ఆయుధ వ్యవస్థలు రష్యా కంటే మెరుగైనవిగా భావించబడుతున్నందున, సంబంధిత విదేశీ దాతలు నిష్పత్తిని 7:3కి మెరుగుపరచాలని భావిస్తున్నారని బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. ఉక్రెయిన్ సైనికాధికారుల అంచనా మరింత నిరాశాజనకంగా ఉంది. ఫ్రంట్ లైన్ పతనం అయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్టు వారు భావిస్తున్నారు. రష్యాను నిలువరించగల సాంకేతికతగానీ, సైనిక బలంగానీ ఉక్రెయిన్‌కు లేవని ఒక ఉన్నత స్థాయి సైనికాధికారి బ్లూమ్‌బెర్గ్‌కి తెలిపారు. ఇటువంటి అంచనా ఉక్రేనియన్ సాయుధ దళాల కమాండర్‌గా ఉన్న వాలెరీ జలుజ్నీ నాయకత్వంలో పనిచేసిన సైనికాధికారుల నుండి వచ్చింది. ఫిబ్రవరి ప్రారంభంలో జెలెన్‌స్కీ వాలెరీ జలుజ్నీ ఉక్రేనియన్ సాయుధ దళాల కమాండర్ పదవి నుంచి తొలిగించాడు. రష్యా సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేయకూడదని ఈ సైనికాధికారులు హెచ్చరిస్తున్నారు.



అనుమతి లేకుండా మందుల తయారీ



- డీసీఏ దాడుల్లో పట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అనుమతి లేకుండా మందులు తయారు చేస్తున్న ఒవైయిడ్ ఫార్మాకెమ్ ప్రయివేట్ లిమిటెడ్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేశారు. ఈ నెల 3, 4 తేదీల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, జీడిమెట్ల గ్రామం, సుభాష్‌నగర్‌లోని ప్లాట్ నెంబర్ 319లో ఉన్న ఫార్మాకెమ్‌పై దాడి చేసి అనుమతి లేకుండా తయారు చేస్తున్న డ్రగ్ లైసెన్స్ లేకుండా 19 రకాల ఔషధాలకు సంబంధించిన రూ.23.93 లక్షల స్టాక్‌ను సీజ్ చేశారు. అదే విధంగా వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, దమ్మన్నపేటలో ఆర్‌ఎంపీగా చెప్పుకుంటున్న అబ్బిడి సుభాష్ రెడ్డికి చెందిన క్లినిక్‌పై దాడి చేసి డ్రగ్ లైసెన్స్ లేకుండా కలిగి ఉన్న 31 రకాల ఔషధాలను, అదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ లోని కేఆర్‌కె కాలనీలో ఆర్‌ఎంపీగా చెప్పుకుంటున్న షేక్ ఫరీద్ క్లినిక్‌పై దాడి చేసి 22 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని మెడికల్ షాపులో అన్ని రకాల జ్వరాలను, టైఫాయిడ్‌ను నయం చేస్తుందంటూ తప్పుడు ప్రకటనలో అమ్ముతున్న హెూమియోపతిక్ ఔషధం ఫెవో గో సిరప్‌ను సీజ్ చేశారు.

పాత మెడికల్ రికార్డుల తొలగింపునకు నిమ్స్ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాత మెడికల్ రికార్డులను తొలగించాలని నిర్ణయించినట్టు నిమ్స్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2011 జనవరి ఒకటో తేదీ వరకు ఉన్న రికార్డులను నిర్వీర్యం చేయనున్నట్టు ఆయన చెప్పారు. పంజాగుట్టలోని నిమ్స్ తాను సేవలందించిన రోగుల మెడికల్ రికార్డుల (ఎంఆర్‌డీ) ఫైల్స్‌ను ఎప్పటికప్పుడు భద్ర పరుస్తుంది. అవసరమైన రోగులకు దరఖాస్తు చేసుకుంటే వారికి అందిస్తుంది. ఈ రకంగా గత కొన్నేండ్లుగా వేలాది రికార్డులు పేరుకుపోయాయి. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ప్రతి పదేండ్లకు ఒకసారి రికార్డులను నిర్వీర్యం చేస్తుంటారు. ఈ కాల వ్యవధిలో ఎవరైనా రోగులు ఆస్పత్రిలో చికిత్స పొందడం, ఎంఎల్‌సీ రికార్డులు, ఇతర కేస్ షీట్‌లు అవసరమైతే మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయం లేదా ఎంఆర్‌డీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

టెట్‌కు 85,412 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 85,412 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేపర్-1కు 34,174 మంది, పేపర్-2కు 51,238 మంది కలిపి 85,412 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. గురువారం రోజు పేపర్-1కు 3,293 మంది, పేపర్-2కు 5,321 మంది కలిపి మొత్తం 8,614 మంది దరఖాస్తు చేశారని వివరించారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల పదో తేదీ వరకు ఉందని తెలిపారు. వచ్చేనెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఏనుగు దాడిలో పోషన్న మృతి బాధాకరం

- బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా
- ఏనుగు సంచారమున్న ప్రాంతాల్లో 144 సెక్షన్ : మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలోని కొండపల్లిలో ఏనుగు దాడిలో కారు పోషన్న అనే మరో వ్యక్తి మరణించడం బాధాకరమని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇస్తున్నట్టు ప్రకటించారు. గురువారం ఈ మేరకు మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గుండా ఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగు వరుస దాడులు చేస్తున్న నేపథ్యంలో చింతలమానేపల్లి, పెంచికల్ పేట్, బెజ్జూర్, దహెగాం ప్రాంతాల్లో 144 సెక్షన్ ను విధించినట్టు మంత్రి తెలిపారు. అటవీ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని పేర్కొన్నారు. సాధారణ పరిస్థితి నెలకొనేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సురేఖ ప్రజలకు సూచించారు.

హైదరాబాద్‌లో రాధాచక్రవర్తి సంస్మరణ సభ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ భారత కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో డాక్టర్ రాధాచక్రవర్తి సంస్మరణ సభను నిర్వహించారు. జంటనగరాల్లో 60 ఏండ్లకుపైగా ఈ సంస్థ పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ ఎస్ చక్రవర్తి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ డి ఫెన్ డే రెవెల్లో ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ రాధాచక్రవర్తితో తమకున్న అనుబంధాన్ని ఆమె సేవానిరతినిఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు నిషా రాజగోపాలన్, విష్ణుబొట్ల గాయత్రి శివాని, జయభాస్కర్, టిపి బాలసుబ్రమణ్యం శ్రావ్యంగా సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కెవి రమణ, సీతారామశర్మ పలువురు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఏఈ పోస్టులకు తుది కీ విడుదల

- టీఎస్‌పీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించి అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లతోపాటు తుది కీ టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. తుది కీపై అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఞఞఞ.ంజూంఞ.ఠ్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఏఈ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు గతేడాది అక్టోబర్ 18 నుంచి 26 వరకు రాతపరీక్షలను నిర్వహించామని తెలిపారు. నవంబర్ ఒకటిన ప్రాథమిక కీని విడుదల చేశామని పేర్కొన్నారు. అదేనెల రెండు నుంచి నాలుగో తేదీ వరకు అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించామని తెలిపారు. వాటిని నిపుణుల కమిటీ పరిశీలించి పలు సూచనలు చేసిందని పేర్కొన్నారు. దాని ఆధారంగా తుది కీని రూపొందించి విడుదల చేశామని వివరించారు. 837 ఏఈ పోస్టుల భర్తీకి 2022, సెప్టెంబర్ 12న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

రక్షణ శాఖలో భారీగా పెరిగిన 'ప్రయివేటు' వాటా

- ఎనిమిదేండ్లతో పోల్చితే అధికం
- రికార్డు స్థాయికి రక్షణ ఎగుమతులు





ఇంటర్నెట్ : 2023-24లో రక్షణ ఉత్పత్తిలో ప్రయివేట్ రంగ సంస్థల వాటా భారీగా పెరిగింది. గత ఎనిమిదేండ్లతో పోల్చుకుంటే ఈ వాటా అధికంగా ఉందని విశ్లేషకులు తెలిపారు. రక్షణ ఎగుమతులు కూడా రికార్డు స్థాయికి చేరుకున్నాయని రక్షణ ఉత్పత్తి శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2023-24 మార్చి 5న విడుదల చేసిన తాజా లెక్కల ప్రకారం మొత్తం రక్షణ ఉత్పత్తి సుమారు రూ.74,739 కోట్లు కాగా అందులో రూ.16,411 కోట్లు (22 శాతం వాటా) ప్రయివేటు సంస్థలకు చెందినదని తెలుస్తోంది. అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఇదే అత్యధికం. ఈ సంవత్సరం ప్రయివేట్ రంగం రక్షణ ఉత్పత్తి 2022-23(రూ.21,083 కోట్లు) కంటే తక్కువగా ఉంది. 2022-23 ప్రయివేట్ రంగం వాటా 19 శాతంగా ఉంది. 2023-24లో రక్షణ ఉత్పత్తి గతం కంటే తగ్గడంతో ప్రైవేట్ రంగం వాటా పెరిగింది. భారత రక్షణ ఉత్పత్తి 2022-23లో 1.09 లక్షల కోట్లు కాగా, 2023-24లో రూ.74,739 కోట్లుగా ఉంది. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డ్, డిఫెన్స్ పబ్లిక్ రంగ సంస్థలు(పీఎస్‌యూ టీ), ఇతర పీఎస్‌యూలు, జాయింట్ వెంచర్లతో కూడిన ఇతర విభాగాలు రక్షణ ఉత్పత్తి శాఖలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశంలో అధిక రక్షణ కోసం ఒత్తిడి చేస్తోంది. ఉదాహరణకు నవంబర్‌లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ రక్షణ కొనుగోలు బడ్జెట్‌లో స్థానిక కంపెనీల కోసం సుమారు రూ.1 లక్షల కోట్లు (75 శాతం) ప్రభుత్వం రిజర్వ్ చేసిందని తెలిపారు. ఇందుకు ఆఫ్‌సెట్ విధానం కూడా సహాయపడుతుందని భావిస్తున్నారు.

డిఫెన్స్ ఆఫ్‌సెట్ విధాన స్థానిక పరిశ్రమ అభివృద్ధికి, సాంకేతికత బదిలీని ప్రోత్సహించడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు. విదేశీ కంపెనీలు దేశీయ సంస్థలలో పెట్టుబడులు లేదా వాటి నుంచి కొనుగోళ్ల ద్వారా స్థానికంగా పెద్ద ఆర్డర్ల కోసం పొందే డబ్బులో కొంత భాగాన్ని ఖర్చు చేయాల్సి ఉంటుంది. 2023-24 నాటి రక్షణ ఆఫ్‌సెట్ మొత్తం విలువ రూ.65941.3కోట్లు. దీనిని 2019-20(రూ.24206.3 కోట్లు)తో పోల్చుకుంటే దాదాపు మూడు రెట్లు పెరిగింది. ఆఫ్‌సెట్ కోసం కంపెనీలు చేసిన అనేక క్లెయిమ్‌లు ఇప్పటికీ ప్రాసెస్ చేయబడలేదు, అవి తదుపరి సమీక్ష కోసం ప్రభుత్వానికి సమర్పించబడతాయి. అవసరమైన అదనపు సమాచారం కోసం లేదా అసంపూర్ణంగా ఉన్నందున ప్రభుత్వానికి సమర్పించే క్లెయిమ్‌ల సంఖ్య మార్చి 2020లో రూ.6594.13 కోట్ల నుండి ఏప్రిల్ 3 నాటికి దాదాపు రూ.2587.57 కోట్లకు తగ్గింది. జనవరిలో నమోదైన రూ.2587.57 కోట్లతో పోలిస్తే ఏప్రిల్ సంఖ్య స్వల్ప పెరుగుదలను చూపుతుంది. భారతదేశ రక్షణ ఎగుమతులు 2022-23లో రూ.15,920 కోట్లుండగా, అది 2023-24లో రికార్డు స్థాయిలో సుమారు రూ.21,083 కోట్లకు చేరుకున్నాయని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రయివేటు రంగం కూడా కొత్త రక్షణ ఉత్పత్తి సౌకర్యాలలో పెట్టుబడులు పెడుతోంది. కాన్పూర్‌లో చిన్న ఆయుధాల తయారీ, నోయిడాలో ఎలక్ట్రో-ఆప్టిక్స్ సౌకర్యాల కొరకు ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ కారిడార్‌కు సుమారు రూ.25,397 కోట్ల పెట్టుబడుల ప్రకటనలు వచ్చాయి. రక్షణ గేర్లు, ఫోటోనిక్స్, థర్మల్ ఇమేజింగ్, ఏరోస్పేస్ కాంపోనెంట్‌లు, రాడార్ సౌకర్యాల కోసం సుమారు రూ. 11,821 కోట్ల విలువైన పెట్టుబడులు తమిళనాడు డిఫెన్స్ కారిడార్‌లో పెట్టారు.

కేసీఆర్‌ను వదిలిపెట్టం

- మునుగోడు ఉప ఎన్నికలో నిబంధనలకు విరుద్ధంగా ఫోన్ ట్యాపింగ్
- బీఆర్‌ఎస్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని ఈసీని కోరుతాం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫోన్ల ట్యాపింగ్, ఫామ్‌హౌజ్ ఫైల్స్ విషయంలో కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వదిలినా తాము మాత్రం వదలబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మునుగోడు ఉప ఎన్నికలో ప్రతిపక్ష పార్టీల నేతల ఫోన్లు ట్యాపింగ్‌కు గురయ్యాయనీ, ఈ విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని ఈసీని కోరుతామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక పార్టీ గుర్తు మీద గెలిచి మరో పార్టీలో చేరటం, మంత్రి పదవులు అనుభవించడం ఫిరాయింపుదారులకు సిగ్గు అనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఫిరాయింపులను ప్రోత్సహించడమే ఎజెండాగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌పై జరుగుతున్న విచారణలో భయంకరమైన అంశాలు, సీనియర్ పోలీసుల అక్రమాలు బయటకు వస్తున్నాయనీ, అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేసీఆర్ కుటుంబం బరితెగించి ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేలా వ్యవహరించిందని ఆరోపించారు. 2014, 2019, 2024 ఎన్నికలతో పాటు, దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు, మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఫోన్ ట్యాపింగ్ చేశారనీ, ప్రయివేటు వ్యక్తులు, వ్యాపారుల ఫోన్లను ట్యాపింగ్ చేసి బెదిరించి కోట్లాది రూపాయలు వసూళ్లు చేశారని విచారణలో తెలుస్తున్నదని చెప్పారు. ఈ ట్యాపింగ్‌లో కేసీఆర్ కుటుంబ ప్రత్యక్ష పాలన తేలాల్సి ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వివరాలన్నీ కేంద్ర హెూమ్ సెక్రెటరీకి ఎందుకు పంపించలేదని ప్రశ్నించారు. ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని గవర్నర్‌ను కోరుతామన్నారు. ఈ కేసును సుమోటోగా ఎన్నికల కమిషన్ తీసుకొని, కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. రైతు బంధు కింద రూ.15 వేలు, కౌలు రైతులకు రైతుబంధు వర్తింపు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, పంటకు రూ.509 బోనస్ ఏమయ్యాయని నిలదీశారు. డిసెంబర్ తొమ్మిదో తేదీనే చేస్తామన్న రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఎక్కడ కనిపించినా తెలంగాణ రైతులు ప్రశ్నించాలనీ, రుణమాఫీ ఏమైందని నిలదీయాలని పిలుపునిచ్చారు. రైతులకు మద్దతుగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా సత్యాగ్రహ దీక్షలు చేపట్టబోతున్నామని చెప్పారు. కృష్ణా జలాల అంశంలో రెండు ప్రభుత్వాలకూ చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కేఆర్‌ఎంబీ సమావేశానికి అధికారులు వెళ్లకపోవడం దురదృష్టకరమన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ఫామ్ హౌస్ ఫైల్స్‌పేరుతో కేసీఆర్ నాటకం ఆడారని విమర్శించారు. ఫామ్ హౌస్ ఫైల్స్ పేరుతో కేసీఆర్ అక్రమంగా వీడియో, ఆడియోలు తీశారు.. ఇంతకన్నా సాక్ష్యాలు ఎన్నికల సంఘానికి ఏం కావాలని ప్రశ్నించారు.

పీడిత, తాడిత వర్గాల కోసం పోరాడిన యోధుడు బాబూజీ : మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పీడిత, తాడిత వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తన జీవితాన్ని అర్పించిన గొప్ప యోధుడు బాబు జగ్జీవన్ రామ్(బాబూజీ) అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ కొనియాడారు. గురువారం ఈ మేరకు మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, కుల నిర్మూలన, సామాజిక సంస్కరణ ఉద్యమాలు, స్వాతంత్ర్యానంతరం దేశ పునర్నిర్మాణంలో ఆయన పోషించిన అద్వితీయమైన పాత్రను స్మరించుకున్నారు. భారత ఉపప్రధానిగా, కార్మిక మంత్రిగా, ఆహార, వ్యవసాయ మంత్రిగా, రక్షణ మంత్రిగా ఎన్నో శాఖలను సమర్థవంతంగా నిర్వహించి భారతదేశ పురోగమనంలో ప్రభావంతమైన పాత్రను బాబూజీ పోషించారని గుర్తుచేశారు. కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటానికి గుర్తుగా ప్రతి ఏటా ఏప్రిల్ 5 న "సమతా దివస్ (సమానత్వ దినోత్సవం)" ను జరుపుకుంటున్నామని మంత్రి తెలిపారు. భారత రాజకీయాల్లో ఆయనది చెరగని ముద్ర అనీ, యువ నాయకత్వానికి బాబూ జగజ్జీవన్ రామ్ స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారని పేర్కొన్నారు. బాబూజీ ఆదర్శాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని హామీనిచ్చారు.

మెమో 1334ను తక్షణమే ఉపసహరించాలి

- అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రిటైర్డ్ బెనిఫిట్ ఇవ్వాలి
- 60 ఏండ్లు నిండినోళ్లకు వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పించాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు నష్టం కలిగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలనీ, అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయల బెనిఫిట్స్ ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఈ మేరకు వారు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. రిటైర్డ్ బెనిఫిట్స్, 60 ఏండ్లు దాటిన వారికి వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఇస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన హామీని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దీనిపై అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవట్లేదని వాపోయారు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులకు 44 రోజుల సమ్మె కాలం వేతనాలను చెల్లించిందనీ, సమస్యలను పరిష్కరిస్తూ నాలుగు జీవోలను విడుదల చేసిందని గుర్తుచేశారు. ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేయాలని చూస్తున్నదని విమర్శించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు నష్టం చేకూర్చే చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- ఎండ తీవ్రత నుంచి కాపాడాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించిన దృష్ట్యా రాష్ట్రంలోని పలు దేవాలయాలను సందర్శించే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. . ఈ నేపథ్యంలో అన్ని దేవాలయాల్లో భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆయన ఆదేశించారు. అన్ని ప్రధాన దేవాలయాల్లో భక్తులు ఎండబారిన పడకుండా షామియానాలు, ఆలయ ప్రాంగణంలో పలు చోట్ల తాగునీటి సౌకర్యాలు, చిన్న పిల్లలకు పాలిచ్చే లాక్టేషన్ గదులు, వృద్ధులు, వికలాంగులకు వీల్ ఛైర్లు, క్యూ కాంప్లెక్స్‌ల వద్ద షెడ్లు తదితర ఏర్పాట్లను రాష్ట్రంలోనే ప్రధాన ఆలయమైన యాదగిరి శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి ఆలయంలో భక్తులకు విస్తృత ఏర్పాట్లను కల్పించారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా గుట్టపైన ప్రధాన ఆలయంలో ఆధునిక జర్మన్ హాంగర్ షెడ్‌ను ఏర్పాటు చేశారు. ఉత్తర మాడ వీధిలో 23,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ హాంగర్ షెడ్ వల్ల స్వామి వారి దర్శనానంతరం భక్తులు సేద తీరడానికి సౌకర్యం ఏర్పడింది. వారి దాహార్తిని తీర్చేందుకు జర్మన్ హాంగర్ సమీపంలోనూ, క్యూ లైన్ల వద్ద మంచినీటి నల్లాలను ఏర్పాటు చేయడంతో పాటు, భక్తులు కూర్చోవడానికి ప్రత్యేకంగా సీటింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూ కాంప్లెక్స్ వద్ద ఏసీ సామర్థ్యాన్ని పెంచినట్టు తెలిపారు. దైవ దర్శనానికి వెళ్లే భక్తులకు టికెట్ కౌంటర్ నుండి క్యూ కాంప్లెక్స్ వరకు షెడ్‌లను ఏర్పాటు చేసినట్టు కమిషనర్ తెలిపారు.

కేసీఆర్..పదేండ్లలో ఎంత మందికి సాయం చేశావ్? : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పదేండ్ల కాలంలో 60 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఎంత మంది రైతులకు సాయం చేశారో మాజీ సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. రైతులను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు రైతులు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ తీరు మనిషిని చంపి ఫొటోకు దండం పెట్టినట్టు ఉందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పంట నష్టపోయి, వడ్లు కొనే దిక్కులేక 11 వేల మంది రైతులు ప్రాణాలు వదిలితే పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. ఫసల్ బీమాను పాతరేసి సమగ్ర పంటల బీమాను అమలు చేయకుండా రైతును ముంచింది నిజం కాదా? వరి వేస్తే ఉరే గతి అంటూ రైతులను అరిగోస పెట్టించింది వాస్తవం కాదా? అని నిలదీశారు. సాగునీటి ప్రాజెక్టులను ఏటీఎంలుగా మార్చుకుని ప్రజల సొమ్మును దోచుకోలేదా? ప్రాజెక్టులు కడితే రాష్ట్రంలో బోర్ల సంఖ్య 18 లక్షల నుండి 28 లక్షలకు ఎందుకు పెరిగిందో చెప్పగలవా? ప్రశ్నించారు. ఏ మొహం పెట్టుకుని నష్టపోయిన పంటలను పరిశీలించడానికి వస్తున్నారని అడిగారు. కేసీఆర్ ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పి కరీంనగర్‌కు రావాలని సూచించారు.రైతులను మోసం చేయడంలో కాంగ్రెస్,బీఆర్‌ఎస్ దొందూ దొందేనని విమర్శించారు.అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, క్వింటా వడ్లకు బోనస్‌గా రూ.500, తాలు, తరుగు, తేమతో పనిలేకుండా వడ్లన్నీ కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

3, 6 తరగతులకు మారనున్న సిలబస్

- నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ కీలక ప్రకటన



న్యూఢిల్లీ : నూతన సిలబస్‌కు సంబంధించి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఇఆర్‌టీ) గురువారం కీలక ప్రకటన చేసింది. 3,6 తరగతులకు మాత్రమే సిలబస్ మారనుందని తెలిపింది. 3వ తరగతి పాఠ్యపుస్తకాలను ఏప్రిల్ చివరి వారం నాటికి, 6వ తరగతి పాఠ్యపుస్తకాలను మే నెల మధ్య నాటికి పాఠశాలలకు అందించనున్నట్లు తెలిపింది. నూతన సిలబస్‌ను అనుసరించి 6వ తరగతి విద్యార్థులకు బోధించేందుకు ఉపాధ్యాయులకు బ్రిడ్జి కోర్స్ ఎన్‌సీఇఆర్‌టీ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నట్లు ప్రకటించింది.2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 1,2,7,8,10,12 తరగతుల పాఠ్యపుస్తకాలు 1.21 కోట్ల కాపీలను దేశవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపింది. 4,5,9,11 తరగతుల పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని, డిజిటల్ కాపీలన్నీ ఎన్‌సీఇఆర్‌టీ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నట్లు సీబీఎస్ఈ ఛైర్‌పర్సన్ ఎక్స్‌లో తెలిపారు. 4,5,9,11 తరగతులకు సంబంధించి 27.58 లక్షల పుస్తకాలు విడుదలయ్యాయని, మరో 1.03 కాపీల కోసం ఆర్డర్ చేశామని తెలిపారు. కొత్త కాపీలు మే 31 నాటికి అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు.

'ఎస్ఏ-2' పరీక్షలు 15కు వాయిదా

- ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో షెడ్యూల్‌లో మార్పు : పాఠశాల విద్యాశాఖ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈనెల ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-2) పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో ఎస్ఏ-2 పరీక్షల షెడ్యూల్‌లో మార్పు చేసినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో ఈనెల ఎనిమిది నుంచి కాకుండా 15 నుంచి ఎస్ఏ-2 పరీక్షలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రంజాన్ సందర్భంగా ముస్లిం విద్యార్థులు ఉపవాసం ఉంటారని వివరించారు. ఇంకోవైపు ఉగాది, రంజాన్ పండుగల మధ్య పరీక్షలను నిర్వహిస్తే విద్యార్థులు వాటిపై సరిగ్గా దృష్టిసారించలేరనీ, బాగా రాయలేరని తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను మార్చేలా విద్యాశాఖ అధికారులను ఆదేశించాలని కోరారు. దీంతో ఎస్ఏ-2 పరీక్షల షెడ్యూల్ మారింది. ఇంకోవైపు పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. అది ఈనెల 13వ తేదీ వరకు జరుగుతుంది. మరోవైపు పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన శిక్షణలు కూడా పూర్తయిన తర్వాతే ఎస్ఏ-2 పరీక్షలను నిర్వహిస్తుండడం గమనార్హం. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి గురువారం సవరించిన టైంటేబుల్‌ను విడుదల చేశారు. అన్ని తరగతుల విద్యార్థులకూ ఉదయం పూట పరీక్షలను నిర్వహిస్తుండడం గమనార్హం. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఆరు, ఏడు తరగతుల వారికి ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటలకు జరుగుతాయని వివరించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి 11.45 గంటల వరకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ పరీక్ష ఈనెల 20న ఉదయం తొమ్మిది నుంచి 11.45 గంటల వరకు, బయలాజికల్ సైన్స్ పరీక్ష అదేరోజు మధ్యాహ్నం 12.30 నుంచి 3.15 గంటల వరకు జరుగుతాయని వివరించారు.

తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ పరీక్ష ఈనెల 20న ఉదయం తొమ్మిది నుంచి 10.30 గంటల వరకు, బయలాజికల్ సైన్స్ పరీక్ష ఉదయం 10.45 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి ఈనెల 23న ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. అదేరోజు తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహిస్తామనీ, మార్కుల రికార్డులపై వారి సంతకాలను తీసుకోవాలని సూచించారు. ఆర్జేడీలు, అన్ని జిల్లాల డీఈవోలు ఎస్ఏ-2 పరీక్షల నిర్వహణపై తగు చర్యలు తీసుకోవాలనీ, మారిన షెడ్యూల్‌ను అమలు చేయాలని ఆదేశించారు.